ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

శనివారం 12 జులై 2025

ఏపీ పేపర్ మిల్లు లాకౌట్
ఆందోళన కొనసాగిస్తున్న కార్మికులు
మెయిన్‌లో

కొవ్వూరులో పరిణామాలపై
జనసేన విచారణ
6

డబ్బులు వసూలు చేస్తే.. సస్పెండ్ చేస్తా

పింఛన్ పంపిణీదారులకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక



నల్లజర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందించాలని..వారి నుంచి ఎవరైనా డబ్బులు వసూళ్లు చేస్తే వెంటనే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. పింఛన్ ఇవ్వలేదని..పింఛన్‌దారుల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్టు ఐవీఆర్ఎస్ కాల్‌లో జగన్నాథపురం గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ మేరకు కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం జగన్నాథపురం గ్రామ సచివాలయానికి విచ్చేసి రికార్డులు పరిశీలించారు.పింఛన్ ఏ విధంగా పంపిణీ చేస్తున్నారని నిలదీశారు. ఉదయం పనులకు వెళ్లే కూలీలు సచివాలయానికి వచ్చి కూర్చోవడంతో కొంత మందికి పింఛన్ అందించినట్టు సిబ్బంది చెప్పారు.దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికెళ్లి పింఛన్ అందించాలన్నారు.పింఛన్లకు డబ్బులు వసూళ్లు చేయడంపై విచారించాలని అక్కడే ఉన్న డీఆర్‌డీఏ పీడీ వీవీఎస్ మూర్తిని ఆదేశించారు.జిల్లావ్యాప్తంగా 512 సచివాలయాల్లో రాని అసంతృప్తి జగన్నాథపురంలో వచ్చిందన్నారు.ఈ నెలలో అనపర్తి 2 సచివాలయం 100 శాతం పింఛన్ అందించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రైతులకు సబ్సిడీపై అందించిన పచ్చిరొట్ట విత్తనాల్లో 50 శాతం మాత్రమే మొలకెత్తాయని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు.దీనిపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుకు సూచించారు.కార్యక్రమంలో తహశీల్దార్ నాయుడు, ఎంపీడీవో సింహాద్రిరావు, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి,మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాసరావు, నిమ్మలపూడి ప్రసాద్,ఏవో సోమశేఖర్ పాల్గొన్నారు.

గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసుల ఛేదన

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇప్పటి వరకూ నమోదైన 24 మంది మహిళలు, చిన్న పిల్లల మిస్సింగ్ కేసులను గంటల వ్యవధిలోనే ఛేదించడం జరిగిందని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం తెలిపారు. మహిళలు, బాలికలపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని చెప్పారు. శక్తి టీమ్‌ల ద్వారా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నామన్నారు. ఉమెన్స్ హాస్టల్‌లో పాయింట్ బుక్స్ పెట్టి తరచుగా శక్తి టీమ్స్ సందర్శించడం జరుగుతుందన్నారు.రాత్రి సమయాల్లో అసాంఘిక శక్తులను అరికట్టడానికి 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో సులువుగా సమాచారాన్ని మార్పిడి చేసుకునే విధంగా ప్రజలు, పోలీసులతో కలిపి 100 వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా అల్లరిమూకలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.



వానోకాలం!

గతేడాది వద్దంటే వానలు..ఇప్పుడేమో..?



జూలైలో ఈ పది రోజులు పరిశీలిస్తే ఒకటీ రెండు మండలాలు మినహా ఉమ్మడి జిల్లాలో అన్నీ లోటు వర్షపాతం కిందే రెడ్ మార్కులోకి వెళ్లిపోయాయి. సాధారణ వర్షపాతం కంటే తక్కువగానే సూచీలు హెచ్చరిస్తున్నాయి. గడచిన 40 రోజుల వర్షపాతం లెక్కలు పరిశీలిస్తే వర్షాభావం తీవ్రత చాటుతోంది. అనేక మండలాల్లో అసలు చినుకు జాడలేదు. జిల్లాల వారీ గా పరిశీలిస్తే గత నెల జూన్ 1 నుంచి ఈ నెల 10 వరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా సరాసరి వర్షపాతం 147.58 మి.మీ.లకు 160.48 మి.మీ. కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో 178.11 మి.మీలకు 192.28 మి.మీ. నమోదైంది. దీంతో ఈ రెండు జిల్లాలు సాధారణ వర్షపాతం జాబితాలో కొనసాగుతున్నాయి. కోనసీమ జిల్లాలో 174.33 మి.మీలకు కేవలం 132.24 మి.మీ. కురిసింది. దీంతో జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. జిల్లాల సరాసరి వర్షపాతం సాధారణంగా ఉండగా.. మండలాల వారీ పరిశీలిస్తే వర్షాభావ తీవ్రత కొంత ఆందోళనకు గురిచేస్తోంది. అదే సమయంలో కొన్ని మండలాల్లో ఏకంగా అదనపు వర్ష పాతం నమోదవడం విశేషం.

రుతుపవనాలు విస్తరించి చాలా వారాలు అవుతున్నా వీటి ప్రభావం ఈసీజన్‌లో పెద్దగా కనిపించడం లేదు. ఈపాటికే వర్షాలు ఎక్కడికక్కడ భారీగా కురవాల్సి ఉండగా చినుకుల జాడే కనిపించడం లేదు. పేరుకు ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవహించి భారీ కుండపోత వాన ఏక్షణమైనా కురుస్తుందన్నట్టు ఉంటున్నా తీరా గాలులు తప్పించి వాన జాడ ఉండడం లేదు. అటు దట్టమైన మేఘాల వల్ల వాతావరణం చల్లబడాల్సి ఉన్నా దీనికి భిన్నంగా ఎండలు మండిపోతున్నాయి. ఫలితంగా వర్షపాతం ఆందోళన కలిగిస్తోంది. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రుతుపవనాలు విస్తరించినా కానరాని వానలు

ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ కరువైంది.. రుతు పవనాలు వచ్చేసినా వరుణుడి జాడ కానరావడం లేదు.. దట్టమైన మేఘాలు ఆవరించినా గాలులే తప్ప చుక్క చినుకు రాలడం లేదు.. ఈ పాటికే భారీ వర్షాలతో జిల్లాలో అదనపు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలు సాధారణ వర్షపాతంతోనే నెట్టుకొస్తున్నాయి. అటు కోనసీమ జిల్లా లోటు వర్షపాతంతో కలవరపాటుకు గురవుతోంది. గతేడాది ఈ పాటికే వానలు దంచి కొట్టాయి.ఈ సారి జూన్ నుంచి ఈ నెల జూలైలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాల్లేకపోవడం అన్నదాతలను కలవరపాటుకు గురిచేస్తోంది.

- ఉమ్మడి జిల్లాలో వర్షపాతం అరకొరే
- కాకినాడ, తూర్పున సాధారణం
- కోనసీమలో 15 మండలాల్లో లోటు
- గతేడాది జూన్‌లో భారీ వానలు
- ఈ ఏడాది చూస్తే కానరాని జాడ
- ఆందోళనలో రైతాంగం

కాకినాడలో లోటు

కాకినాడ జిల్లాలో మొత్తం 21 మండలాలకు 18 మండలాల్లో సాధారణ వర్షపాతమే కొనసాగుతోంది. మూడు మండలాల్లో అవ సరానికి మించిన వాన నమోదైంది. అం దులో గొల్లప్రోలు మం డలం జిల్లాలో అన్నింటికంటే అద నపు వర్షపాతంతో కొనసాగు తోంది.ఇక్కడ గడచిన 40 రోజుల్లో 66.17 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 106.11 మి.మీ. కురిసింది.కోట నందూరులో 103.07 మి.మీ.లకు 173.97 మి.మీ కురిసింది. తొండంగి మండలంలో 145.28 మి.మీకు 182.06 మి.మీ కురిసింది.అదే ఈ నెల పది రోజుల జిల్లా సరాసరి వర్షపాతం తీసుకుంటే 51.16 మి.మీ. కు రవాల్సి ఉంటే 39.71 మి.మీ కురిసి లోటు కొనసాగుతోంది.

తూర్పున ఇలా...

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 మండలాలకు 14 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా ఐదు మండలాల్లో మాత్రం అదనపు వర్షపాతం నమో దైంది.చాగల్లు మండలంలో గడచిన 40 రో జుల్లో 155.61 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 203.33, దేవరపల్లిలో 162.71కి 225.13, కొవ్వూరులో 166.3కు 213.56, నల్లజర్లలో 151.38కి 215.41, రాజమండ్రి అర్బన్‌లో 173.64కి 208.69 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కోనసీమలో కలవరం..

కోనసీమ జిల్లాలో మొత్తం 22 మండలాలు ఉంటే ఏకంగా 15 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. గడచిన 40 రోజుల్లో అయినవిల్లి మండలంలో 188.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 123.14 మాత్రమే కురిసింది.అల్లవరం 182.85కు 131.51, అమలాపురం 187.65కు 128.54 మి.మీ,అంబాజీపేట 183.81కి 131.12, ఐ.పోలవరం 165.57కు 119.03, కాట్రేనికోన 177.89కి 120.36, మామిడికుదురు 181.27కి 134.3, ముమ్మిడివరం 188.42కి 120.72, పి.గన్నవరం 183.9కి 134.84,పామర్రు 156.26కి 119.78, రామచం ద్రపురం 153.69కి 120.7, రాయవరం 166.61కి 123.9, రాజోలు 191.98కి 139.97, సఖినేటిపల్లి 208.17కు 144.04,ఉప్పలగుప్తం 172.93కు 124.86 మి.మీ. వర్షపాతమే నమోదైంది.కోనసీమలోనే లోటు అధికంగా ఉంది.

అప్పుడే నయం..

మే నెలలో కాకినాడ జిల్లా అంతా కలిపి 109.77 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 115.48 మి.మీ. నమో దైంది. జూన్‌నెలలో 96.57 మి.మీలకు 120.75 మి.మీ. నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో మేలో 78.56 మి.మీకు 136.54 కురవగా, జూన్‌లో 107.77 మి.మీకు 145.27 మి.మీ. కురిసింది. కోనసీమ జిల్లాలో మేలో 72.55 మి.మీకు 130.88 మి.మీ. కురవగా, జూన్‌లో 102.37 మి.మీ వర్షపాతానికి 108.25 మి.మీ కురిసింది. 2024లో జూన్ నెలలో కాకినాడ జిల్లాలో 112.8 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే .210.2 మి.మీ కురిసింది.. కోనసీమలో 111.4కి 175.3 మి.మీ నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో 117.0కి 198.3 కురిసింది. గతేడాది జూలైలో కాకినాడ జిల్లా 198.0 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 223.8 మి.మీ. కురిసింది. కోనసీమలో 241కి 339.9 మి.మీ, తూర్పుగోదావరి జిల్లాలో 247.1కు 374.7 మి.మీ. కురిసింది. కానీ ఈ ఏడాది జూలైలో మాత్రం మొత్తం లోటు వర్షపాతం కొనసాగుతోంది.

రాతలు చెరిగాయ్!



- రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు
- వైసీపీ రాతలూ చెరిపేశారు
- ఆగస్టు నుంచి కొత్త పాస్ బుక్స్
- 31 గ్రామాల్లో కూటమి సర్వే
- సర్వే నెంబర్లు ఇక గురుతులే
- ఎల్‌పీఎం, పీపీఎం పేరిట అమలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సరిహద్దు రాళ్ల మీద జగన్ బొమ్మను తొలగించారు.వాటితో పాటు రాళ్ల మీద వైఎస్ఆర్ జగనన్న భూరక్షణ 2020 అనే రాతలు తొలగించారు. ఇక కొత్త పాసు పుస్తకం వచ్చింది. ఆగస్టు నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. దాని మీద గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా సీఎం బొమ్మల వంటి దరిద్రం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ,సింబల్ ఉంటుంది. రెవెన్యూశాఖ పేరు ఉంది. సింబల్ పైన భూమి యాజమాన్యపు హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం అని మాత్రం ఉంది. భూమి యజమాని ఫోటో, వారి వివరాలు అందులో ఉన్నాయి. గత ప్రభుత్వం జిల్లాలో 163 గ్రామాల్లో 2,14,319 రాళ్ల పాతి దానిపై బొమ్మలు వేసింది. రాతలు రాసింది. ఈ ప్రభుత్వం వాటిని తొలగించి ఆనవాళ్లు లేకుండా చేసింది.

జిల్లాలో 6 లక్షల ఎకరాలు

జిల్లాలో మొత్తం 272 గ్రామాల్లో 605331.86 ఎకరాల విస్తీర్ణం ఉంది. రాజమహేంద్రవరం డివిజన్ 10 మండలాల పరిధి 123 గ్రామాల్లో 299963.2 ఎకరాలు, కొవ్వూరు డివిజన్ 9 మండలాల పరిధి 149 గ్రామాల్లో 315268.66 ఎకరాలు ఉన్నాయి. 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో కొన్ని గ్రామాల్లో సర్వే చేసి పాస్ పుస్తకాల మీద జగన్ బొమ్మ ముద్రించిన సంగతి తెలిసిందే. సరిహద్దు రాళ్ల పేరిట రాళ్లు వేసి వాటిపై జగన్ బొమ్మతో పాటు వైఎస్ఆర్ జగనన్న భూరక్ష అనే రాతలు రాసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజల్లో పెద్ద అలజడి మొదలైంది. అప్పట్లో తెలుగుదేశం కూటమి పార్టీలు వ్యతిరేకించాయి. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024 ఎన్నికల్లో విజయం సాధించడంతో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం భూహక్కు చట్టాన్ని రద్దు చేశారు. అంతేకాకుండా పైలెట్ గ్రామాల పేరుతో రీసర్వే ఆరంభించారు. మొదట 16 గ్రామాలు, రెండో దశ 15 గ్రామాల్లోనూ సర్వే చేస్తున్నారు. సర్వే వేగంగా జరుగుతోంది.ఈ నెల 14 నుంచి మిగతా గ్రామాల్లో సర్వే ఆరంభి స్తారు. నవంబరు నాటికి పూర్తి చేసే యోచనలో ఉన్నారు.

సర్వే నంబర్ ఉండదు..

ఇంతవరకూ మీ భూమి ఎక్కడ ఉందని అడిగితే సర్వే నంబర్ చెప్పేవారు. ఇక సర్వే నంబర్ అనే మాట వినిపించదు. ఇప్పటికే రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో సర్వే అనే మాటను తొలగిస్తున్నారు. వ్యవసాయ భూమికి సంబంధించిన లాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పీఎం)ను అమల్లోకి వచ్చారు. ఒక చోట ఒకరికి చెందిన భూమి అంతా ఒక ఎల్‌పీఎం నంబర్‌లోకి వస్తుంది. ఇక ఇళ్ల స్థలాలు,ఇళ్లు, ఇతర ఆస్తుల విషయాల్లో ప్రాపర్టీ పార్శిల్ మ్యాప్ (పీపీఎం)ను వాడతారు.ఒక వ్యక్తికి సంబంధించిన స్థలానికి ఒకే పీపీఎం నంబర్ ఇస్తారు. ఆన్‌లైన్‌లో ఈ నెంబర్‌తోనే సంబంధిత ఆస్తి ఉంటుంది. ఇక గజాల కొలతలు మానేస్తున్నారు. చదరపు మీటరులోనే కొలతలు లెక్కలు చూపిస్తారు. ఎకరానికి 4046. 856 చదరపు మీటర్లు అని అర్థం .

మళ్లీ పోలీస్ గ్రీవెన్స్ డే ఆరంభం

పోలీసుల ఆనందం

రాజమహేంద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సమస్యలు పరిష్కరించడానికి, వారి సంక్షేమానికి ఈ గ్రీవెన్స్‌డే ఉపకరిస్తుందని అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన 10 మంది సిబ్బంది వారి ఇబ్బందులను వివరించారు. గత కొన్ని ఆగిపోయిన గ్రీవెన్స్‌డే మళ్లీ ప్రారంభం కావడంపై పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఇదే మొదటి పోలీస్ గ్రీవెన్స్ అని తెలుస్తోంది.. ఇప్పటి వరకూ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి చెప్పడానికి వచ్చినా ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా హోంగార్డు నుంచి ఏఎస్ఐ వరకూ సెలవులు, అనుమతులు, లోన్లు, బదిలీలు తదితర విషయాలకు సంబంధించి సీఐ స్థాయిలోనే సమస్య ఆగిపోతోంది. జిల్లాలో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు ఉన్నా వారిని గానీ, జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీని గానీ కలవడమంటే ఏడాదిగా వారికి సాహసమనే పరిస్థితి నడిచింది. ఎస్పీని కలవడానికి వెళితే సైంధవులు అడ్డుపడేవారని..ఇప్పుడు సమస్యలు స్వతం త్రంగా.. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎస్పీకి చెప్పుకొనే అవకాశం కల్పించారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అడిషనల్ ఎస్పీ సుబ్బరాజుకు సమస్యలను విన్నవిస్తున్న పోలీస్ సిబ్బంది

11 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

ఇసుక ర్యాంపులపై ఆకస్మిక దాడులు

రాజమహేంద్రవరం/రూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో ప్రతిరోజు రాత్రి పగలు తేడాలేకుండా డ్రెడ్జింగ్ బోట్లు ఇసుకను తోడేస్తున్నాయి. గామన్ బ్రిడ్జికి సమీపంలో డ్రెడ్జింగ్ పెద్దఎత్తున జరుగుతుంది. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక బోట్ల నుంచి రేవులకు చేరి అక్కడ నుంచి లారీల్లో సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో డ్రెడ్జింగ్ బోట్లపై నిఘాపెట్టిన మైనింగ్ అధికారులు శుక్రవారం మెరుపుదాడి చేశారు. గామన్ బ్రిడ్జికి మత్స్యకారుల నివాసాలకు మధ్యలో అమ్మవారి ఆలయం పక్కనే నిలుపుదల చేసిన 8 డ్రెడ్జింగ్ బోట్లను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. మాన్యువల్‌గా ఉన్నబోట్లను వదిలేశారు. దీంతో కాతేరు ,కోటిలింగాల ఇసుక రేవులు ఉలిక్కిపడ్డాయి. ఎందుకంటే దాదాపుగా అన్ని రేవులు కూడా డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించే ఇసుకను తోడేస్తున్నారు. ఈ ఘటనతో అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట జరుగుతున్న అక్రమాలు బయటపడ్డాయి. గురు, శుక్రవారాల్లో అధికారులు తనిఖీలు చేసి ధవళేశ్వరం, కోటిలింగాల, కాతేరు ప్రాంతాల్లో అనధికారికంగా..నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ చేసే 11 బోట్లను అధికారులు సీజ్ చేశారు. ధవళే శ్వరంలో లలితాదేవి పేరుతో ఉన్న డ్రెడ్జింగ్ బోటులో ఉన్న భీమడోలు మండలం ఆగడాలలంకకు చెందిన ఘంటసాల ఏసురాజు, బాలకోటి రామ్మూర్తిని ఆరా తీయగా యజమానులెవరో తెలియదని చెప్పడం గమనార్హం.



డ్రెడ్జింగ్ బోట్లు పరిశీలిస్తున్న అధికారులు

కానీ విచారణలో విశాఖపట్నానికి చెందిన రాకేష్ ఈ బోటుకు యజమాని అని స్థానికంగా ఉన్న బిక్కిన రవి అనే వ్యక్తి వీటిని పర్యవేక్షిస్తారని తేలినట్టు అధికారులు తెలిపారు.శ్రీలలిత బోటుతో పాటు శ్రీ లక్ష్మి గణపతి వీరభద్రయ్య , సద్గురు శ్రీ సాయినాథ సాత్విక్ డ్రెడ్జింగ్ బోటు, శ్రీలక్ష్మీ డ్రెడ్జింగ్ బోటును సీజ్ చేశారు. రాజమండ్రి కోటిలింగాల, కాతేరు గోదావరి తీరంలో బోయజు రుతు పేరుతో ఉన్న డ్రెడ్జింగ్ బోట్లు 2, కోటేశ్వరరావు పేరుతో డ్రెడ్జర్ మౌంటెడ్ ఫైబర్ బోటు, సుబ్రహ్మణ్య ఆంజనేయ,శ్రీ శ్యామలాంబ మెకనైజ్డ్ బోట్లు, శ్రీశ్యామలాంబ అండ్ విఘ్నేశ్వర బోటు, శ్రీవిద్యానంపాట లక్ష్మి బోటు,మరో రెండు పేరు లేని బోట్లు స్వాధీనం చేసుకుని ఇరిగేషన్ ఏఈకి అప్పగించారు.



కొత్త రేషన్‌కార్డులకు..
ఈకేవైసీ గుదిబండ!

- ఇది పూర్తి కాకపోవడంతో పెండింగ్‌లోనే కొత్త రేషన్‌కార్డులు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెండింగ్‌లో 23,720 దరఖాస్తులు
- రెండు నెలలుగా విచారణ దశలోనే ఆగిపోయిన వైనం
- కుటుంబంలో ఒకరి ఈకేవైసీ పెండింగ్‌గైనా నిలిచిపోతున్న కార్డులు
- కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

కొత్తరేషన్‌కార్డులకు ఈకేవైసీ పెద్ద గుదిబండగా తయారైంది. సచివాలయంలో కొత్త రేషన్ కార్డుకోసం దరఖాస్తులను స్వీకరించిన తర్వాత ఈకేవైసీ పూర్తి చేస్తేనే విచారణలో అధికారులు ముందుకు వెళ్లగలరు. ఈకేవైసీ దగ్గరే రేషన్‌కార్డుల విచారణ నిలిచిపోతోంది. కొత్తకార్డులతో పాటు మార్పులు, చేర్పులకు కూడా ఇది పెను సవాల్‌గా మారింది.

కలెక్టరేట్(కాకినాడ)-ఆంధ్రజ్యోతి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రేషన్‌కార్డులకోసం, మార్పులు, చేర్పులు, విభజనకోసం 1,46,860 దరఖాస్తులను స్వీకరించారు. దీనిలో 1,08,669 దరఖాస్తులకు ఆమోదం తెలిపారు. వీరికి వచ్చేనెలలో కొత్త రేషన్‌కార్డులు(స్మార్ట్ కార్డులు) ప్రభుత్వం అందజేయనుంది. ఈకేవైసీ పెండింగ్ నేపథ్యంలో 23,720 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. రేషన్‌కార్డు విభజన నేపథ్యంలో దరఖాస్తు చేసుకున్న మరో 14,471 దరఖాస్తులు కూడా పరిశీలనలో ఉన్నాయి. దీని వల్ల రేషన్‌కార్డుల మంజూరు క్రతువు ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించడంలేదు. దాదాపు రెండునెలలనుంచి కొత్తరేషన్‌కార్డుల కోసం సచివాలయాల్లో కసరత్తు చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరిస్తున్నారుగానీ రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారో స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. కొన్ని దరఖాస్తుల విచారణ నెల నుంచి నెలన్నర వరకు పట్టడంతో వాటికి మోక్షం కలగడంలేదు.

ఐదేళ్లు పూర్తిచేసుకుంటే ఆధార్ అప్‌డేట్

చిన్నారులు తీసుకున్న ఆధార్‌ను తమ వయస్సు ఐదేళ్లు పూర్తిచేసుకున్న తర్వాత తప్పనిసరిగా అప్‌డేట్ చేయాలి. లేనిపక్షంలో ఈకేవైసీ నిలిచిపోతోంది. ఈ నేపథ్యంలో కొన్ని రేషన్‌కార్డుల విచారణ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోతోంది. ఒక కుటుంబంలో ఐదుగురు సభ్యులు ఉంటే.. దానిలో నలుగురు ఈకేవైసీ పూర్తి చేసుకున్న తర్వాత ఒక అభ్యర్థికి పూర్తి కాకపోతే ఆ కార్డు విచారణ దశలోనే ఉండిపోతోంది. ఏదైనా ఉద్యోగం, ఉపాధి, చదువు నిమిత్తం కుటుంబంలో ఒక సభ్యుడు ఆయా గ్రామాలకు దూరంగా ఉంటే రేషన్‌కార్డు మంజూరుప్రక్రియ ఆగిపోతోంది.

పరిష్కారం కాని మ్యాపింగ్ సమస్యలు

రేషన్‌కార్డుకు వివాహమై పిల్లలు ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలంటే భార్యభర్తలు, పిల్లలు ఒకేచోట హౌస్ మ్యాపింగ్ అయి ఉండాలి. గత వైసీపీ ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా కుటుంబాల స్థితిగతులను తెలుసుకోవడానికి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ చేశారు.ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఇదే ప్రామాణికంగా తీసుకుంది. తల్లిదండ్రులు, వారి పిల్లలు ఒకే కుటుంబం అయినా మ్యాపింగ్‌లో ఒకే చోట లేకపోతే దరఖాస్తుల విచారణ ముందుకు సాగడంలేదు. మ్యాపింగ్ సమస్యతో దరఖాస్తులను నిలిపివేస్తున్నారు.

డిలీట్ ఆప్షన్ లేదు

రేషన్ కార్డులు నమోదు చేసే సమయంలో సాఫ్ట్‌వేర్‌లో డిలీట్ ఆప్షన్ ఉపయోగించడానికి వీలు కావడంలేదు. కార్డులో ఎవరైనా మృతి చెందితేనే డిలీట్ ఆప్షన్ ఉపయోగించే వెసులుబాటు ఉంది. విభజన సమయంలో ఒక కార్డులో ఉన్న సభ్యులను డిలీట్ చేసి వేరొక కార్డు మంజూరు చేయడానికి ఆప్షన్ ఇంకా ఇవ్వలేదు. దీనివల్ల ఒక కార్డులో ఉన్న సభ్యులను డిలీట్ చేసి కొత్త కార్డులో నమోదు చేసే ఆస్కారం లేదని అధికారులు వెల్లడించారు.

ఆదాయపన్ను చెల్లించినా ఇబ్బందులే..

ఒక వ్యక్తి కొంతకాలం వ్యాపారం నిర్వహించి ఆదాయపన్ను చెల్లిస్తున్నారు. తర్వాత కొన్నికారణాలవల్ల వ్యాపారం మూసివేసి ఆదాయపన్ను చెల్లించడం లేదు. అలాంటివారు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేస్తే విచారణ సమయంలో నిలిచిపోతోంది. గతంలో చెల్లించిన ఆదాయ పన్ను వివరాలు ఆన్‌లైన్‌లో కనిపిస్తుండడంతో కార్డు మంజూరు కావడం లేదని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కొత్త వివరాలు నమోదు చేసి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ఇకపైన స్మార్ట్ రేషన్‌కార్డులు

ఇకనుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు రానున్నాయి. ఇవి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. వచ్చేనెలలో వీటిని పంపిణీ చేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి ఒకవైపు జగన్,మరోవైపు వైఎస్ఆర్ బొమ్మలను ముద్రించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నేతల బొమ్మలు లేకుండా కొత్త స్మార్ట్‌కార్డులను రూపొందిస్తోంది. కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీకూడా స్మార్ట్‌కార్డులుగానే ఉంటాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈస్మార్ట్ రేషన్‌కార్డును రూపొందిస్తున్నారు. దీనికోసం పౌరసరఫరాలశాఖ కసరత్తు చేస్తోంది. స్మార్ట్‌రేషన్‌కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు ఫొటో ఉంటాయి. రేషన్‌కార్డు నెంబరు, షాపు వివరాలు ఉంటాయి. కార్డు వెనుక భాగంలో కార్డుదారుని కుటుంబీకుల వివరాలు ఉంటాయి.

విచారణ వేగవంతం చేయాలని ఆదేశించాం: రుద్రరాజు సత్యనారాయణరాజు, డీఎస్‌వో, కాకినాడ జిల్లా

రేషన్‌కార్డుల విచారణ వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించాం. కాకినాడజిల్లాతోపాటు మిగిలినచోట్ల అన్ని సచివాలయాల్లో ప్రతిరోజూ రేషన్‌కార్డుల విచారణ జరుగుతోంది. విచారణ పూర్తయిన వాటిని ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నారు. ఈకేవైసీపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. రేషన్‌కార్డులో కొంతమంది సభ్యులు స్థానికంగా అందుబాటులో లేకపోవడంవల్ల కొంతవరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఆమోదం లభించిన కార్డు లకు వచ్చేనెలలో స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేసే అవకాశం ఉంది.

జిల్లాలవారీగా పరిశీలిస్తే ఇలా..

కాకినాడ జిల్లాలో..

కాకినాడ జిల్లాలో రేషన్‌కార్డుల మార్పులు, చేర్పులు, విభజనకోసం 60,317మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటికి 40,659మంది దరఖాస్తులు ఆమోదం లభించింది. 16,170 దరఖాస్తులు విచారణలో వివిధ స్థాయిలో ఉన్నాయి. దీనిలో ప్రత్యేకించి కొత్తకార్డుల కోసం 4,968 దరఖాస్తుచేసుకోగా 2,945 రేషన్‌కార్డులకు ఆమోదం లభించింది. 2,023 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. కార్డుల విభజనకోసం 6015 దరఖాస్తులు రాగా 4,131 ఆమోదం లభించింది. 2012 దరఖాస్తులను అధికారులు విచారణ చేస్తున్నారు.

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో..

కోనసీమ జిల్లాలో రేషన్‌కార్డుల మార్పులు, చేర్పులు, విభజన కోసం 43,224 దరఖాస్తులు రాగా 34,200 ఆమోదం లభించింది. 9,024 దరఖాస్తులు విచారణలో ఉన్నాయి. దీనిలో కొత్తకార్డులతోపాటు విభజన సమస్యలు ఉన్న కార్డులున్నాయి.

తూర్పుగోదావరి జిల్లాలో..

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 43,319 దరఖాస్తులు రాగా దీనిలో 33,800 ఆమోదం లభించింది. 9,519 విచారణలో ఉన్నాయి. దీనిలో కొత్తకార్డులతోపాటు చేర్పులు, మార్పులు, విభజన సమస్యలు ఉన్నాయి.

తొలి పులస వచ్చేసింది

- యానాంలో పులస రూ.18వేలు



యానాం మార్కెట్‌లో పులసతో మత్స్యకార మహిళ రత్నం

యానాం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోదారికి కొత్తనీరు వచ్చింది.. ఇలా వచ్చిందో లేదో.. తొలి పులస కూడా వచ్చేసింది.. ధర కూడా భారీగానే ఉందండోయ్.. రూ.18వేలు పలికింది.. గోదావరి పులసా.. మజాకానా మరి..!

మాంసహార ప్రియులకు అత్యంత ఇష్టంగా తినే పులసల సీజన్ మొదలైంది. యానాం గౌతమీ గోదావరికిఎర్రనీరు పోటెత్తిన సమయంలో పులసలు లభ్యమవుతాయి. శుక్రవారం యానాం మార్కెట్‌కు తొలి పులస వచ్చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో వేటకు వెళ్లిన మత్స్యకారులకు కిలోన్నర పులస మత్స్యకారులకు చిక్కింది. దీన్ని యానాం మార్కెట్‌లో పోనమండ భద్రం, రత్నం దంపతులు రూ.15వేలకు పాడి దక్కించుకుని దాన్ని రూ.18వేలకు విక్రయించారు. గోదావరికి వరద నీరు రావడంతో తొలి పులస దొరికింది. రానున్న వరదకు మరిన్ని పులసలు మత్స్యకారులకు దొరికే అవకాశం ఉంది.

కొవ్వూరు నియోజకవర్గంలో పరిణామాలపై విచారణ

- రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని పవన్ ఆదేశం

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలపై విచారించి నివేదిక ఇవ్వాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను జనసేనాని పవన్‌కల్యాణ్ ఆదేశించినట్టు సమాచారం. కొవ్వూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి ప్రాధాన్యమివ్వడం లేదని ఆ పార్టీ నాయకుడు టీవీ రామారావు ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ అధిష్ఠానం కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా చర్యలున్నాయంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి టీవీఆర్‌ను తప్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు జనసేన కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ఆందోళన చేపట్టడంతో పార్టీ అధిష్ఠానం స్పందించింది. కొవ్వూరులో ఉన్న పరిస్థితులను తెలుసుకుని, అన్నివర్గాలతో మాట్లాడి రెండువారాల్లో నివేదికివ్వాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను ఆదేశించింది.

మళ్లీ పెరుగుతున్న గోదావరి



దేవీపట్నం మండలం పోశమ్మగండి గ్రామంలో చేరిన వరదనీరు

దేవీపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): గోదావరి మళ్లీ పెరుగుతోంది. దేవీపట్నం మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాలైన కొండమొదలు, నడిపూడి, తెలిపేరు, మంటూరు,కచ్చులూరు,మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం,తొయ్యేరు, పూడిపల్లి గ్రామాల్లో గోదావరి మళ్లీ పోటెత్తింది. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద నీరు చేరి పలు గ్రామాలను ముంచింది. రెండురోజులక్రితం గోదావరినీరు తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఉదయం నుంచి మళ్లీ గోదావరి పరివాహక ముంపు ప్రాంతాలైన కొండమొదలు నుంచి పోశమ్మగండి వరకు గ్రామాల్లోకి వరద నీరు చేరింది. దీంతో దేవీపట్నం మండలంలో వేగంగా గోదావరి వరద పెరుగుతోంది. గండిపోశమ్మ తల్లి అమ్మవారి ఆలయంతోపాటు రోడ్లు మునిగిపోయాయి. అమ్మవారి ఆలయంవద్ద దుకాణాల్లోకి నీరు ప్రవేశించడంతో సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం ఇస్తున్న ఈవో

వాడపల్లి వెంకన్న సన్నిధిలో 'జబర్దస్త్' వర్ష



స్వామివారిని దర్శించుకుంటున్న వర్ష

ఆత్రేయపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. 'జబర్దస్త్' ఫేమ్ వర్ష కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.5.07లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రావులపాలేనికి చెందిన కంకటాల సూర్యనారాయణ-భారతి దంపతులు రూ.లక్ష విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటం అందజేశారు.

పార్కింగ్ సమస్యను పరిష్కరించండి

శనివారం అరటి ఆకులో అన్నప్రసాదం అందించండి

'డయల్ యువర్ ఈవో'లో భక్తుల అభిప్రాయాలు



ఫోనులో భక్తుల సమస్యలు వింటున్న ఈవో సూర్యచక్రధరరావు

ఆత్రేయపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈవో నల్లం సూర్యచక్రధరరావు శుక్రవారం 'డయల్ యువర్ ఈవో' నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 32 నుంచి 40 మంది భక్తులు 08855-271888 నెంబరుకు ఫోను చేశారు. పార్కింగ్ ప్రదేశంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రస్తావించారు. ప్రతి శనివారం అరటి ఆకులో భోజనం పెట్టాలని ఓ భక్తురాలు కోరింది. అనంతరం ఈవో మాట్లాడుతూ.. పార్కింగ్ ప్రదేశంలో కొంత స్థలాన్ని సేకరించి మెరక పనులు చేపడుతున్నామన్నారు. ప్రతి శనివారం సుమారు 25వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తున్నారన్నారు. వకుళ మాత అన్నదాన భవన నిర్మాణం త్వరలోనే పూర్తి చేస్తామని, ఒకేసారి 3500 మంది టేబుల్స్‌పై కూర్చుని తినేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి భక్తుడికి అరటి ఆకులో స్వామివారి ప్రసాదం అందిస్తామన్నారు. భద్రతా సిబ్బందిని పెంచుతామన్నారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని ప్రతి శుక్రవారం కొనసాగిస్తామని చెప్పారు.

'పాడా'కు రూ.3కోట్ల నిధులు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీకి రూ.3 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్ పంపిన నివేదిక ఆధారంగా ఈ నిధులు మంజూరయ్యాయి. సిబ్బంది జీతభత్యాలు, పరిపాలనాపరమైన వ్యయం, మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను వినియోగించాలని ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ జారీ చేసిన జీవో నెం.122లో ఆదేశించారు.

నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివం



కాకినాడలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సదాశివం

కాకినాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. కాకినాడలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సదాశివం మాట్లాడుతూ దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు రూ.25 వేలు కనీస వేతనం అమలు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జీవో నెం.130 జారీ చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని కృతజ్ఞతలు తెలిపారు. దేవాలయాల పాలక మండళ్లలో నాయీబ్రాహ్మణులకు సభ్యునిగా అవకాశం కల్పిస్తామని సీఎం చెప్పారన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలు అందజేస్తామని, బీసీ రక్షణ చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఆదరణ పథకం ద్వారా చేతివృత్తులు, కులవృత్తుల వారిని ఆదుకోవడానికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారన్నారు. సమావేశంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్లు లంకా రత్నారావు, సూరవరపు నాగరాజు, యానాపు ఏసు, కోరుప్రోలు నూకరాజు, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు ర్యాలి సత్యనారాయణ, సిటీ అధ్యక్షుడు వేపాడ శ్రీను, రూరల్ అధ్యక్షుడు కోట ఉమా అచ్యుత రమణ, కింతాడ సత్తిబాబు, కొమ్మల తాతారావు, మల్లువలస విష్ణుచక్రం, మెల్లిపాక నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లోకాయుక్త జోక్యం

రూ.3.66 కోట్ల లైబ్రరీ సెస్ బకాయిలకు మోక్షం

కాకినాడ సిటీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్త జోక్యంతో దశాబ్దకాలంగా పెండింగులో ఉన్న రూ.3.66 కోట్ల లైబ్రరీ సెస్ బకాయిలు వసూలయ్యాయి. కాకినాడ జిల్లాకు చెందిన కె.సాంబశివరావు చేసిన ఫిర్యాదు (32 04/2017/బి1) మేరకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ స్థానిక సంస్థల నుంచి ఈ బకాయిలను గ్రంథాలయ సంస్థ తిరిగి పొందడంలో ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త కీలక పాత్ర పోషించింది. 2007-08 నుంచి 2016-17 మధ్య కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, తుని, పిఠాపురం, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటు అన్ని గ్రామ పంచాయతీలు సేకరించిన లైబ్రరీ సెస్‌ను జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించడంలో విఫలమయ్యాయని సాంబశివరావు ఫిర్యాదు చేశారు.

దీనిపై లోకాయుక్త జారీ చేసిన ఆదేశాలకు స్పందిస్తూ కలెక్టర్ విచారణ చేపట్టి బకాయిలు ఉన్నమాట వాస్తవమేనని అంగీకరిస్తూ నివేదిక సమర్పించారు. లోకాయుక్త నిరంతర జోక్యం, పర్యవేక్షణ కారణంగా సదరు కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, స్థానిక సంస్థలు తాము బకాయిపడ్డ రూ.366.88 లక్షలు చెల్లించాయి.


సంస్థాగతంగా ఏర్పడిన అవకతవకలను నివారించడం, స్థానిక సంస్థల మధ్య జవాబుదారీతనాన్ని పెంపొందించడం. లైబ్రరీ సెస్ వంటి చట్టపరమైన బాధ్యతలను నెరవేర్చడంలో లోకాయుక్త తన పాత్రను సమర్థవంతంగా పోషిస్తోందని, ప్రజలకు సేవలు అందించడంలో పారదర్శకత, సమస్యలను పరిష్కరించడానికి నిబద్ధతతో పనిచేస్తోందని లోకాయుక్త రిజిస్ట్రార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నర్సరీలను సందర్శించిన కర్ణాటక మంత్రి మల్లికార్జున్

కడియం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం బుర్రిలంకలోని ఏకేఎస్‌వీ నర్సరీని కర్ణాటక రాష్ట్ర మైనింగ్, జియాలజీ, ఉద్యాన శాఖల మంత్రి ఎస్ఎస్ మల్లికార్జున్ శుక్రవారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేత రత్నం అయ్యప్ప మొక్క అందించి స్వాగతం పలికారు. కొన్ని రకాల ఫల, పుష్ప, ఆర్నమెంటల్, ఇండోర్, ఔట్‌డోర్, ఔషధ మొక్కల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన కడియపులంకలోని గౌతమి, కోదండరామ, సత్యనారాయణ, శివాంజనేయ నర్సరీలను సందర్శించారు. దేశంలో కడియం హార్టికల్చర్ హబ్‌గా ఉందని కితాబిచ్చారు.



బుర్రిలంకలోని ఏకేఎస్‌వీ నర్సరీని తిలకిస్తున్న మంత్రి మల్లికార్జున్



భక్తులకు అనుగ్రహభాషణ చేస్తున్న స్వామీజీ

విజయానంద తీర్థ స్వామీజీ చాతుర్మాస్య దీక్ష

పిఠాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మంలో అత్యంత పవిత్రంగా భావించే చాతుర్మాస్య వ్రత దీక్షా మహోత్సవానికి కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం అగ్రహారంలో కొలువైయున్న అనఘా దత్త క్షేత్రం వేదికైంది. మైసూరు దత్త పీఠం ఉత్తరాధికారి దత్త విజయానంద తీర్థ స్వామీజీ ప్రత్యేక పూజల అనంతరం చాతుర్మాస్య వ్రత దీక్ష చేపట్టారు. దీనిని సెప్టెంబరు 7వ తేదీ వరకు కొనసాగించనున్నారు. గురుపరంపర పూజ, చైతన్యార్చన, వ్యాస పూజ, గణపతి సచ్చిదానంద పాదుకా పూజ జరిగాయి. నవకోటి దత్తయాగ మహాసంకల్పంలో భాగంగా అష్టమ కోటి దత్త యాగానికి అంకురార్పణ చేశారు. సాయంత్రం గురుగీతా పారాయణ జరిగింది. యజుర్వేద ఘన పారాయణను ప్రారంభించారు. ఇది ఆగస్టు 3వ తేదీ వరకు కొనసాగుతుంది. సాయంత్రం జైమిని భారతం చాతుర్మాస్య ప్రవచనాలను ప్రారంభించారు. చాతుర్మాస్య దీక్ష చేపట్టిన దత్త విజయానంద తీర్థ స్వామీజీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు ప్రముఖులు కలిశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

లైంగిక వేధింపులు నిజమే..

- జీజీహెచ్ విద్యార్థినులతో ల్యాబ్ టెక్నీషియన్ తరచూ అసభ్య ప్రవర్తనే
- విద్యార్థినులను లైంగికంగా వేధించిన చక్రవర్తిపై విచారణ కమిటీ నివేదిక వెల్లడి
- 55 మంది విద్యార్థినులు, 15 టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఫిర్యాదులన్నీ నిజమే
- మరో ముగ్గురు సిబ్బంది కూడా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని వేధింపులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

"ఏయ్..ఒక్కడినే వెళ్తున్నా...కారులో వస్తావా...ఏంటీ సరిగ్గా డ్యూటీ చేయడం లేదు.. ఆరోజు ఏకాంతంగా కలుద్దామా...ఈ మధ్య బాడీ వెయిట్ పెరిగిపోతోంది..రూంలోకి వెళ్దామా..అన్నీ చూసుకుంటా.." అంటూ భుజాల మీద చేతులు వేయడం..అక్కడి నుంచి నడుంపైన.. తొడలను తాకడం..ఎవరైనా పేషెంట్లు చూసి మందలిస్తే వారిపైనా అరవడం...ఇలా ఒకటేంటి రకరకాల వెకిలి చేష్టలతో లైంగిక వేధింపులకు పాల్పడడం జీజీహెచ్‌లో బయోకెమిస్ట్రీ ల్యాబ్ అసిస్టెంట్ వి.కళ్యాణ్ చక్రవర్తి పరిపాటిగా మారింది. ఒకటికాదు రెండుకాదు అనేకసార్లు ఇతడి ప్రవర్తన గతి తప్పి వ్యవహరిస్తూనే ఉంది. పలుసార్లు విద్యార్థినులు సంబంధిత విభాగం హెచ్‌వోడీ దృష్టికి చక్రవర్తి కీచకపర్వాన్ని తీసుకెళ్లినా చక్ర వర్తి తన తీరు మార్చుకోలేదని విచారణ కమిటీ స్పష్టంచేసింది. జీజీహెచ్‌లో విద్యార్థినులను లైంగికంగా వేధించిన ఘటనపై విచారణ చేపట్టిన అంతర్గత కమిటీ తన నివేదికను రంగరాయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్, అడిషనల్ డైరెక్టర్‌కు శుక్రవారం అందజేసింది. తమ విచారణలో తేలిన అనేక విషయాలను నివేదికలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ కూలంకుషంగా వివరించారు. జీజీహెచ్‌లో డీఎంఎల్‌టీ, బీఎస్సీ, ఎంఎల్‌టీ, వొకేషనల్ ఎంఎల్‌టీ విద్యార్థినులు మొత్తం 55మంది నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు తీసుకున్నామని తెలిపింది. ఇవికాక బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, పాథాలజీ విభాగాలకు చెందిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ 15 మంది సైతం చక్రవర్తి లైంగిక వేధింపులను పూసగుచ్చినట్టు వివరించారని నివేదికలో ప్రస్తావించింది. ఎన్నో రోజులుగా ల్యాబ్ అసిస్టెంట్ ఎందరో విద్యార్థులను వేధించినట్టు తేల్చింది. కానీ బాధితులు భయంతో ముందుకు రాలేదని పేర్కొంది. దీన్ని అలుసుగా తీసుకుని చక్రవర్తి మరింత రెచ్చిపోయినట్టు వివరించింది. అనేకసార్లు విద్యార్థులను లైంగికంగా వేధించినట్టు తమ విచారణలో తేలినట్టు తెలిపింది. చక్రవర్తి అసభ్య ప్రవర్తన గురించి తమకు కూడా తెలుసని బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, పాథాలజీ విభాగాల సిబ్బంది కమిటీ ఎదుట వివరి ంచారని స్పష్టం చేసింది. అలాగే బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ, కొందరు అనేకసార్లు చక్రవర్తిని హె చ్చరించారని, అయినా సదరు ఖాతరు చేయ లేదని కమిటీ తేల్చిచెప్పింది. జీజీహెచ్ ఓపీ విభాగంలోని శాంపిల్ కలెక్షన్ సెంటర్‌లో తరచూ అసభ్యంగా ప్రవర్తిస్తోన్న చక్రవర్తికితోడు మైక్రో బయోలజీ ల్యాబ్ టెక్నీషియన్ జిమ్మీరాజు (ఇతడు కోనసీమ జిల్లా మండపేట నియోజకవ ర్గంలోని ఓ వైసీపీ సర్పంచ్‌కు దగ్గరి బంధువు. సదరు సర్పంచ్ గతంలో ఉమ్మడి జిల్లా రెవెన్యూ అసోసియేషన్‌లో కీలక నాయకుడిగా సైతం వెలిగారు). బయోకెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ గో పాలకృష్ణ ఇద్దరు మద్యం తాగి డ్యూటీకి వచ్చే వారని నివేదికలో కమిటీ వివరించింది. మద్యం తాగి విద్యార్థులపై అరుస్తూ వారిని వేధించే వారని తెలిపింది. అలాగే పాథాలజీ ల్యాబ్ అసి స్టెంట్ ప్రసాద్ అయితే విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని బూతులు తిట్టేవాడని వివరించింది.



నిందితుడు కళ్యాణ్ చక్రవర్తి

ఇదిలాఉంటే ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని రంగరాయ కాలేజీ ప్రిన్సిపాల్ కాకినాడ ఏఎస్పీకి శుక్రవారం లేఖ రాశారు. ఈనెల 9న రాత్రి 10.12గంటలకు విద్యార్థినుల నుంచి మెయిల్‌లో ఫిర్యాదు అందిందని, దీని ఆధారంగా విచారణ చేపట్టామని అందులో పేర్కొన్నారు. అందులో చక్రవర్తి అసభ్యకరంగా విద్యార్థినులతో వ్యవహరించాడని.. డర్టీ, వల్గర్, రబ్బీష్ భాష వాడి విద్యార్థినులు, పేషెంట్లను వేధించాడని పేర్కొన్నారు. బాడీ షేమింగ్ చేయడంతోపాటు ఏకాంతంగా విద్యార్థులను తన గదికి రమ్మని కోరినట్టు తేలిందని వివరించారు. అతడికి తోడు మరో ముగ్గురు ల్యాబ్ సిబ్బంది సైతం విద్యార్థినులను వేధించిన నేపథ్యంలో వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎం సీరియస్...

జీజీహెచ్ విద్యార్థినులపై లైగింక వేధింపుల వ్యవహారం ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌లో కూలంకుషంగా రావడం తీవ్ర కలకలం రేపింది. దీనిపై సీఎం చంద్రబాబు తక్షణం స్పందించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో మాట్లా డారు. తక్షణం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. దీంతో ఆగమేఘాలపై పోలీసులు నిందితులపై కేసులు నమోదు చేశారు. అటు ఉద్యోగాల నుంచీ సస్పెండ్ చేశారు. ఘటన వెనక ఏం జరిగింది? విద్యార్థినులను నిందితులు ఏవిధంగా లైంగికంగా వేధించారనేదానిపై కలెక్టర్, ఎస్పీ శుక్రవారం మధ్యాహ్నం మీడియా సమావేశం ఏర్పాటు చేసి నిందితులపై తీసుకున్న చర్యలను ప్రకటించారు.

ఆ నలుగురి అరెస్ట్!

- వారిపై చట్టపరమైన చర్యలు
- ధైర్యంగా ఫిర్యాదు చేసిన విద్యార్థినులు, స్పందించిన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలకు అభినందనలు
- 'రంగరాయ' లైంగిక వేధింపుల ఘటనపై వివరాలు వెల్లడించిన కాకినాడ కలెక్టర్
- ఫిర్యాదు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేశాం : కాకినాడ ఎస్పీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీ

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

రంగరాయ వైద్యకళాశాలలోని పారామెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధించడమే కాకుండా అసభ్యకరంగా, అనుచితంగా మెసేజ్‌లు పెడుతూ వేధిస్తున్న నిందితులు ల్యాబ్ అటెండెంట్ వాడ్రేవు కల్యాణ్ చక్రవర్తి, మైక్రోబయాలజీ ల్యాబ్ టెక్నీషియన్ బి.జిమ్మిరాజు, బయోకెమిస్ట్రీ ల్యాబ్ టెక్నీషియన్ ఎస్.గోపాలకృష్ణ, పేథాలజీ విభాగ ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్‌లపై విచారణ జరిపి వారిని విధుల నుంచి సస్పెండ్ చేయడంతోపాటు అరెస్టు చేసినట్టు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. కాకినాడ రంగరాయలో పారా మెడికల్ విద్యార్థినులను లైంగికంగా వేధిస్తున్న ఘటనపై ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఇలాంటి ఘటనలు విద్యాసంస్థలు, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో పునరావృతం కాకుండా చేపట్టిన చర్యలను వివరించారు.

విద్యార్థినుల ఆరోపణలు నిజమే

రంగరాయ వైద్యకళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.కల్యాణ్‌చక్రవర్తి తమ పట్ల అసభ్యంగా ప్రవరిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని కళాశాలలో బీఎస్సీ-మెడికల్ లేబొరేటరీ టెక్నాలజీ కోర్సు చదువుతున్న 50 మంది విద్యార్థులు ఈనెల 9వతేదీన ఈ మెయిల్ ద్వారా కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశారని కలెక్టర్ తెలిపారు. దీనిపై ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ వెంటనే స్పందించి ఈ ఫిర్యాదును కళాశాలలోని లైంగిక వేధింపుల నిరోధానికి కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ విచారణకు అప్పగించారని..ఈ కమిటీ ఈనెల 9, 10 తేదీల్లో బీఎస్సీ-ఎంఎల్‌టీ కోర్సు చదువుతున్న 50మంది విద్యార్థినులు, నిందిత ఉద్యోగులను విచారించి అందరి వాంగ్మూలాలు, సాక్ష్యాలను నమోదు చేసిందన్నారు. ఈ విచారణలో 50 మంది విద్యార్థినులు నిందితుడు వాడ్రేవు కల్యాణ్ చక్రవర్తితోపాటు మరో ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, ఎస్.గోపాల్‌కృష్ణ, బి.జిమ్మిరాజు, జీవీఎస్ ప్రసాదరావులు కూడా తమపై లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్టు తెలిపారన్నారు. కమిటీ విచారణలో ఈ నలుగురిపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిజమని తేలిందని, ఈ మేరకు నలుగురి నిందితులను రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ సస్పెండ్ చేసి వారిపై స్థానిక కాకినాడ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయగా శుక్రవారం వారందరినీ అరెస్టు చేశారని కలెక్టర్ వివరించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటనలో తమపై జరుగుతున్న లైంగిక వేధింపులపై ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేసిన విద్యార్థినులను, ఫిర్యాదుపై తక్షణ విచారణ నిర్వహించి, వారిలో వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని నింపిన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీలను కలెక్టర్ అభినందించారు.

శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోండి : కాకినాడ ఎస్పీ

కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎంసీ ఘటనలో పోలీస్ స్టేషన్లలో శుక్రవారం ఉదయం ఫిర్యాదు నమోదు కాగా నేరారోపితులు నలుగురినీ మధ్యాహ్నం రెండున్నర గంటలలోపు అరెస్టు చేశామన్నారు. సంబంధిత సెక్షన్ల ప్రకారం అరెస్టు చేశామని వెల్లడించారు. బాలికలు, మహిళల రక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా పోలీసుశాఖ శక్తియాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని.. విద్యార్థినులు, వర్కింగ్ ఉమెన్ తమపట్ల జరిగే అకృత్యాల నుంచి రక్షణ పొందేందుకు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో రంగరాయ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రీనివాసన్, ఆర్ఎంసీ పారామెడికల్ కోర్సుల కోఆర్డినేటర్ డాక్టర్ సతీష్ ఉన్నారు.

ధరాభారం!

- బహిరంగ మార్కెట్లో మండుతున్న కూరగాయల ధరలు
- లోకల్ పంట లేకపోవడంతో భారీగా పెరుగుదల
- మరింత పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



రాజమహేంద్రవరం అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్లో లభ్యత లేకపోవడంతో బహిరంగ మార్కెట్లలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. దాదాపు కూరగాయలన్నింటినీ ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో మార్కెట్ దళారీలు, రవాణా చార్జీలు, వ్యాపారుల లాభం కలగలసి సామాన్యుడి ఆర్థిక వెన్ను విరుస్తున్నాయి. లోకల్‌గా రైతులు పండించే కూరగాయల సీజన్ ముగియడం, వర్షాలు, వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా దిగుబడులు లేకపోవడం పరిస్థితిని దిగజార్చుతున్నాయి. ఫలితంగా వంటల్లో ప్రధానమైనవి గా పరిగణించే టమోటా, పచ్చిమిర్చి, వంకాయలు, బీరకాయలు వంటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బహిరంగ మార్కెట్లలో టమోటా కిలో రూ.60కు చేరుకోగా, పచ్చిమిర్చి మరింత ఘాటెక్కి రూ.120కు చేరింది. చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమోటాను, కడప జిల్లా మైదుకూరు నుంచి పచ్చిమిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. వంకాయల ధరలోనూ పెరుగుదల కనిపిస్తోంది. దొమ్మేరు రకం వంకాయలు కిలో రూ.80 వరకూ ధర ఉంది. కడప జిల్లా గిద్దలూరు నుంచి అంకూరు చిక్కుళ్లు, వంకాయలు తెస్తున్నారు. బహిరంగ మార్కెట్లలోని ధరలతో పోల్చితే అధికారుల నియంత్రణలోని రైతుబజార్లలో ధరలు కాస్త తక్కువే అనిపించినా క్వాలిటీలో రాజీ పడాల్సి ఉంటుందనేది అందరికీ తెలిసిందే. ధనికవర్గాలకు దీని వల్ల ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మధ్యతరగతి, సామాన్యజీవులకు మాత్రం భారంగా మారుతోంది.

అప్పటి వరకూ భరించాల్సిందే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలైన సీతానగరం, కడియం మండలాలతోపాటు కోరుకొండ మండలం నుంచి రాజమహేంద్రవరం మార్కెట్లకు కూరగాయలు ఎక్కువగా వస్తుంటాయి. టమోటా సీతానగరం మండలంలోని రాజంపేట, కూనవరం ప్రాంతాల్లో ఎక్కువ సాగు చేస్తారు. కడియం ఏరియాలో టమోటా సాగు విస్తీర్ణం చాలా తక్కువ. టమోటా సాగుకు వాతావరణం ప్రతిఏటా ఆగస్టు, సెప్టెంబరులో మాత్రమే అనుకూలంగా ఉంటుంది. దీంతో లోకల్ టమోటా డిసెంబరులో మాత్రమే చేతికి అందుతుంది. అలాగే, లోకల్‌గా బీర, బెండ, దొండ, ఆనబ, వంకాయ వంటి కూరగాయల సాగు ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నారు. వీటి దిగుబడులు రావాలంటే దాదాపు నెలన్నర సమయం పడుతుందని చెబుతున్నారు. అప్పటి వరకూ బయటి సరుకుపైనే ఆధారపడాల్సి ఉంటుంది. అప్పటి వరకూ ధరలు భరించక తప్పని పరిస్థితి ఉంటుంది.

లభ్యత తక్కువ, డిమాండ్ ఎక్కువ...

రావులపాలెం సమీపంలోని మడికి మార్కెట్‌కు ఆ చుట్టుపక్కల రైతులు సాగుచేసే కొన్ని రకాల కూరగాయలు వస్తున్నా హోల్‌సేల్ మార్కెట్ కారణంగా ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వ్యాపారులు ఎక్కువ ధరపెట్టి పాడుకుని తరలించుకుపోతుంటారు. దీంతో దాని ప్రభావం లోకల్ మార్కెట్లపైనా పడుతుంది. మార్కెట్‌లో లభ్యత తక్కువ, డిమాండ్ ఎక్కువ కారణంగా కూరగాయల ధరలు దిగిరావడంలేదు. ఈ పరిస్థితి మరి కొన్నాళ్లు తప్పకపోవచ్చనే అభిప్రాయం రైతులు, వ్యాపారుల్లో వ్యక్తమవుతోంది.

ధరలు ఎలా ఉన్నాయంటే...

రెండు వారాల క్రితం ఉన్న కూరగాయల ధరలకు ఇప్పుడున్న ధరలకు అసలు పోలికలేదు. కొన్ని కూరగాయలు రెట్టింపు ధర పెరిగితే, పచ్చిమిర్చి ధర మూడింతలు ఎక్కువైంది. అంతలా రేట్లు భగ్గుమంటున్నాయి. బహిరంగ మార్కెట్లలో ధరలను పరిశీలిస్తే ... కిలో టమోటా రూ.30 నుంచి రూ.60కు పెరిగింది. దొమ్మేరు వంకాయలు రూ.40 నుంచి రూ.80కి, పచ్చిమిర్చి 40 నుంచి రూ.120కి, బీరకాయలు రూ.40 నుంచి రూ.60కి, దొండకాయలు రూ.30 నుంచి 60కి, చిక్కుళ్లు రూ.50 నుంచి రూ.110కి, క్యాప్సికం రూ.40 నుంచి 120కి ధర పెరిగిపోయింది. రైతుబజార్లలోనూ ధరలు ఎక్కువగానే ఉన్నాయి. కిలో పచ్చిమిర్చి రూ.55, టమోటా రూ.30, దొమ్మేరు వంకాయలు రూ.54, సర్పవరం గులాబీరకం రూ.48, తెలుపుచార రూ.40, నలుపు రూ.44, బీరకాయలు రూ.44, దొండకాయలు రూ.38, చిక్కుళ్లు రూ.70, క్యాప్సికం రూ.90గాఉంది. ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని రైతుబజార్లలోని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు.

మధ్యాహ్న భోజనం తిని 21 మంది విద్యార్థులకు అస్వస్థత

- పాఠశాలలో పులిహోర, టమోటా పచ్చడి వడ్డింపు
- తిన్న పది నిమిషాల్లో కొందరికి వాంతులు, కడుపునొప్పి
- గౌరిదేవిపేట పీహెచ్‌సీకి తరలింపు



గౌరిదేవిపేట పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

ఎటపాక,జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తిని 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగింది. పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 139 విద్యార్థులు చదువుతు న్నారు. శుక్రవారం మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులకు పులిహోర, టమోటా పచ్చడి వడ్డించారు. అది తిన్న విద్యార్థులు పది నిమిషాల్లో అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే వారిని సమీపంలో ఉన్న పీహెచ్‌సీకి తరలించారు. మొత్తం 21మంది అస్వస్థతకు గురవ్వగా అందులో ఐదేళ్ల నుంచి 15 ఏళ్లలోపు విద్యార్థులే ఉన్నారు. అందులో ఆకుల రామలక్ష్మీ, బొగ్గా ప్రేమిక, రాయి లోకేశ్‌కు వాంతులు కావడంతో సెలైన్లు ఎక్కించి చికిత్స అందించారు. మరో 18 మంది విద్యార్థులకు కడుపు నొప్పి రావడంతో ప్రథమ చికిత్స చేశారు. అయితే ఊడికీ ఉడకని పులిహోర తినడం వల్లే విద్యార్థులకు అజీర్తీ చేసిందని, దాంతో అస్వస్థతకు గురైనట్టు వైద్యాధికారి దీవీనాగ్ తెలిపారు. కాగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు వంటషెడ్డులేక బరకాలు కట్టి అపరిశుభ్ర వాతావరణంలో వంటలు తయారుచేస్తున్నట్టు విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బరకాలపై నుంచి ఆహారంపై ఈగలు, బొద్దింకలు పడుతున్నాయని విద్యార్థులు చెప్తున్నారు.

విచారణకు పీవో ఆదేశం

విద్యార్థులకు అస్వస్థత విషయం తెలుసుకున్న ఐటీడీఏపీవో అపూర్వ భరత్ వెంటనే స్పందించారు. ఘటనపై వెంటనే విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఎంఈవో సరియం రాజులును ఆదేశించారు. దాంతో ఎంఈ వెంటనే గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చేరుకుని ఉపాధ్యాయులతో విచారణ జరిపారు. ఘటనకు గల కారణాలు, విద్యార్థులకు వడ్డించిన ఆహారం విషయంపై అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పీవో అడిగి తెలుసుకున్నారు.

వివాదాల పరిష్కారంలో మన ధోరణిదే ముఖ్య పాత్ర : పీడీజే సునీత



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీడీజే సునీత

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): కుటుంబం, సమాజంలో వివాదాలు రావడం సహజమని వాటిని ఎలా పరిష్కరించుకోవాలనే అనే అంశంలో మన ధోరణి ముఖ్య పాత్ర వహిస్తుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన న్యాయవాద మధ్యవర్తిత్వంపై ప్రొఫెషనల్- ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. మధ్యవర్తిత్వంలో శిక్షణ ద్వారా సమస్యల పరిష్కారానికి సహకార దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ, కేరళకు చెందిన సీనియర్ ట్రైనర్లు థాంకచన్, సురేశ్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు అమలాపురంలో ఉచిత మెగా వైద్యశిబిరాలు

అమలాపురం టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు 125వ జయంతి ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు (బాబి) తెలిపారు. ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి కుసుమంచి పాపారావు, అమలాపురం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, వరదా సూరిబాబు, పోశెట్టి సూరిబాబు, లక్కింశెట్టి బాబులు, కాసు శ్రీనివాస్‌లతో కలిసి శుక్రవారం ఆయన అమలాపురంలో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, అమలాపురం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, గైనిక్, డెంటల్, ఈఎన్‌టీ సంబంధిత సమస్యలకు సంబంధించిన వైద్యులు శిబిరంలో అందుబాటులో ఉంటారన్నారు. ఉచితంగా మందులు ఇవ్వడమే కాకుండా ఈసీజీ, ఎకో వంటి టెస్టులతో పాటు రక్త పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దంత సమస్యలకు సంబంధించి క్లీనింగ్, సిమ్మెంట్ ఫిల్లింగ్ వంటివి ఉచితంగా చేయనున్నట్టు వెల్లడించారు. అమలాపురంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘ పచ్చిగోళ్ల జనార్ధనరావు కల్యాణ మండపం, కొల్లూరి సత్యనారాయణమూర్తి మినీ కల్యాణ మండపాల్లో వైద్య శిబిరాలను ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు

గండేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): 2 కిలోల గంజాయితో వ్యక్తిని అరెస్టు చేసినట్టు జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, గండేపల్లి ఎస్‌ఐ యువి శివనాగబాబు తెలిపారు. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కిర్లంపూడి గ్రామానికి చెందిన టి.రాజశేఖర్ గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా 14 రోజుల రిమాండ్ విధించారు.



తొండంగి ఎంపీడీవో సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ

తొండంగి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి ఎంపీడీవో బి.రాజేశ్వరావును సస్పెండ్ చేస్తూ పంచాయితీ రాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళి మండలంలో ఈవోపీఆర్డీ, ఎఫ్ ఏసీ ఎంపీడీవోగా పనిచేసిన సమయంలో రూ.14 లక్షల 84 వేల 900 నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అభియోగాలు రుజువు కావడంతో కమిషనర్ సస్పెన్షన్ నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తుని ఎంపీడీ వోకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

అమ్మ దగ్గరికి వెళ్తా...

తల్లి మృతి తట్టుకోలేక కొడుకు ఆత్మహత్య




మరణించిన వెంకటేశులు

బిక్కవోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తల్లి మృతిని తట్టుకోలేక కొడుకు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం రంగాపురానికి చెందిన కానాటి వెంకటేశులు (30) తల్లి 3 నెలల క్రితం మృతిచెందింది. అప్పటి నుంచి వెంకటేశులు తల్లిపై బెంగపెట్టుకుని మతిస్థిమితం లేకుండా ఉండడంతో రాజమహేంద్రవరం మానస ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే తరచూ తన తల్లి వద్దకు వెళ్లిపోతాననేవాడు. గురువారం ఉదయం అతడు గడ్డి మందు తాగి వాంతులు చేసుకోవడంతో భార్య ప్రశ్నించగా మా అమ్మ వద్దకు వెళ్లిపోతున్నానని తెలపడంతో వెంటనే అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుతాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పాండవులు (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మరణించాడు. గ్రామానికి చెందిన మాగిరెడ్డి పాండవులు(47) మద్యానికి బానిసై ఇంటి నుంచి తరచూ వెళ్లిపోవడం, కొంతకాలానికి తిరిగి రావడం చేస్తున్నాడు. ఇదే రీతిలో ఈనెల 10న ఇంటికి తిరిగి వచ్చిన అతడు పేలు మందును మద్యంలో కలిపి తాగాడు. అతడిని కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొం దుతూ పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో మరణించాడు. మృతుడి కుమారుడు నాగబాబు ఫిర్యాదుతో గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రాజేశ్ (ఫైల్)

దేవరపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందిన సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గొల్లగూడెంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గోపాలపురం మండలం వేలచింతల గూడెనికి చెందిన మందపాటి రాజేశ్ (20) గొల్లగూడెంలో కేబుల్ ఫైబర్‌నెట్‌లో పోతుల శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గొల్లగూడెం దగ్గర కేబుల్‌వైర్‌ను ఎలక్ట్రికల్ స్తంభానికి కడుతుండగా 11కేవీ విద్యుత్‌వైరు తగలడంతో నిచ్చెన పై నుంచి రాజేశ్ కింద పడడంతో తీవ్ర గాయాలుకాగా గోపాలపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు చెప్పారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



తునిరూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలో నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ యార్డు వద్ద రైలు పట్టాలు దాటుతున్న గుర్తుతెలియని వ్యక్తిని శుక్రవారం రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సుమారు 40ఏళ్ల వ్యక్తి మృతి చెందాడని, నలుపు రంగు షాట్, ఎడమచేతిపై మిర్నో అనే పచ్చబొట్టు ఉందని రైల్వే పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిస్తే 9490619020లో సంప్రదించాలని కోరారు.

'అన్నవరం'లో అభివృద్ధి పనులకు ఆమోదం

- రూ.70 లక్షలతో సీసీకెమెరాల రికార్డింగ్ సామర్థ్యం 90 రోజులకు పెంపుదల
- రూ.23 లక్షలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా డివైడర్స్ ఏర్పాటు

అన్నవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం పలు అభివృద్ధి పనుల అంశాలను చైర్మన్ ఐవీ రోహిత్ ఆమోదించారు. ఈవో వీర్ల సుబ్బారావు, ఇతర అధికారులు ప్రతిపాదించిన అంశాలపై చర్చించి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రధానంగా రూ.70 లక్షలతో సీసీకెమెరాల రికార్డింగ్ బ్యాకప్ సామర్థ్యాన్ని 90రోజులకు పెంచేందుకు అవసరమైన సర్వర్ల కొనుగోలు, హార్డ్‌డిస్క్‌ల ఏర్పాటుకు సిద్ధం చేసిన అంచనాలు ఆమోదించి దేవదాయ కమిషనర్ అనుమతితో చేపట్టాలని నిర్ణయించారు. రూ.27లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న మెట్ల మార్గంలో స్ట్రీట్‌లైట్స్, సౌండ్‌సిస్టమ్, సీసీకెమెరాలు, ప్యానల్‌బోర్డు, కేబుల్ ఏర్పాటుకు అంచనాలకు అంగీకారం తెలిపారు. రూ.23 లక్షలతో రత్నగిరి, సత్యగిరిపై వివిధ ప్రదేశాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రీకాస్ట్ ఆర్‌సీసీ డివైడర్స్ ఏర్పాటుకు అంచనాలు, రూ.26 లక్షలతో సత్యగిరి పవర్‌హౌస్ నుంచి విష్ణుసదన్ వద్దకు పాడైన కేబుల్ స్థానంలో నూతనంగా కొనుగోలు చేయడానికి, రూ.18.65 లక్షలతో వ్రత మండపాల వద్ద స్లాబ్‌లీకులు అరికట్టడం తదితర పనులకు, కనకదుర్గ, వనదుర్గ ఆలయం రంగులు వేసేందుకు ఇటీవల పిలిచిన టెండర్లలో లోయస్ట్ టెండర్‌ను ఆమోదించారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రూ.6.75 లక్షలతో రోడ్డు విస్తరణ చేపట్టి సీసీరోడ్డు వేయడానికి తయారుచేసిన అంచనాలను రూ.9.25 లక్షలతో పంపా రిజర్వాయర్ నుంచి బోర్‌వెల్స్‌కు వెళ్లే మార్గానికి ర్యాంప్ ఏర్పాటుకు తయారుచేసిన అంచనాలను ఆమోదించి నియమ నిబంధనల మేరకు పనులు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఈవోలు, ఇంజనీరింగ్, విద్యుత్‌విభాగ అధికారులు, సూపరెంటెండెంట్‌లు పాల్గొన్నారు.

చిన్నారిని బలిగొన్న పైపులైన్ గొయ్యి

గోతిలో పడి నాలుగేళ్ల బాలుడి మృతి



మృతిచెందిన బాలుడు శ్రీను

దివాన్‌చెరువు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువులోని రేగులచెరువు జంగాల కాలనీలో పైపులైన్ కోసం తీసిన గొయ్యి నాలుగేళ్ల చిన్నారిని బలిగొంది. స్థానికుల వివరాల ప్రకారం.. స్థానిక గ్రామ పంచాయతీ సిబ్బంది పైపులైన్ మరమ్మతు కోసం వారం రోజుల క్రితం తవ్విన గోతిలోకి నీరు చేరింది. జంగాల కాలనీలో నివసించే కడమంచిలి దుర్గారావు కుమారుడు శ్రీను (4) శుక్రవారం సాయంత్రం ఆడుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ ఆ గోతిలో పడిపోయాడు. ఈ విషయాన్ని తోటి పిల్లలు శ్రీను తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు వెంటనే చేరుకుని చూసేసరికి అప్పటికే శ్రీను మృతిచెందాడు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వైసీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, కూటమి నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. కాగా బొమ్మూరు పోలీసులు కూడా ఘటనా స్థలం వద్దే ఉన్నారు. అయితే తమకు ఏ ఫిర్యాదు అందలేదని ఎస్ఐ మురళీమోహన్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

మల్లయ్యపేట రహదారి పరిశీలన


మల్లయ్యపేట పెట్రోల్ బంక్ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ 11(ఆంధ్రజ్యోతి): మల్లయ్యపేట రోడ్డును అధికారులు శుక్రవారం పరిశీలించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామంలో సిటీ సరిహద్దు ప్రాంతమైన మల్లయ్యపేట రోడ్డులో దుమ్ముధూళితో స్థానికులు పడుతున్న కష్టాలపై 'సేవ్ మల్లయ్యపేట' శీర్షికతో శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ ప్రశాంతి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం జిల్లా పంచాయతీ, రెవెన్యూ అధికారులు మల్లయ్యపేటకు చేరుకుని పెట్రోల్ బంక్ నుంచి పేపర్ మిల్ నార్త్‌గేట్‌కు వెళ్లే రోడ్డును, మల్లయ్యపేట మెయిన్ రోడ్డును పరిశీలించారు. ఇసుక లారీలు వచ్చే క్రమంలోను, రోడ్డుపై వెళ్తున్న బస్సులు, ఇతర వాహనాల రన్నింగ్‌లో వచ్చే ధూళిని స్వయంగా పరిశీలించారు.మల్లయ్యపేటలో రహదారులు పాడుకాకుండా చర్యలు చేపడుతున్నట్టు అధికారులు స్పష్టం చేశారు. సమస్య పరిష్కారానికి ఎన్నిరోజులు పడుతుందో వేచిచూడాల్సిందే. ఇంతలో బ్లేడు ట్రాక్టర్ పెట్టి రోడ్డుపై అట్టగట్టిన మట్టిని తొలగించేపనులు చేపట్టారు. స్థానికులు మాత్రం సమస్య పరిష్కారం కాకపోతే ధర్నాలు చేసేందుకు సిద్ధమౌతున్నారు.

కువైట్‌లో ఉపాధి అవకాశాల దరఖాస్తుకు
నేటితో గడువు ముగింపు
జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళీ

రాజమహేంద్రవరం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్తంగా తురియా అనే అంతర్జాతీయ సంస్థతో కలిసి కువైట్‌లో ఉన్నత నైపుణ్యం కలిగిన నిర్మాణ కార్మికులకు ఉద్యోగ అవకాశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల12వ తేదీతో ముగుస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన అర్హత కలిగిన నిరుద్యోగ యువత దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 24 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న పురుష అభ్యర్థులు, సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్ లేదా సీలింగ్ పనుల్లో ఐటీఐ లేదా డిప్లొమా ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. 3 నుంచి ఐదేళ్ల అనుభవం తప్పనిసరి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు కువైట్‌లో ఉద్యోగ అవకాశం, నెలకు కువైట్ డాలర్ 200నుంచి 250వరకు జీతం వస్తుందని, ఇది ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.56 వేలు నుంచి 70 వేల వరకు వస్తుందని తెలిపారు. మరింత సమాచారం కోసం 99888 53335ను సంప్రదించాలని కోరారు. వీసా ప్రాసెసింగ్, విమాన టిక్కెట్లు, వైద్య సదుపాయాలు, నివాస ఏర్పాట్లు కంపెనీ అందిస్తుందన్నారు. ఆసక్తి గల వారు పాస్పోర్ట్, విద్యార్హతలు, అనుభవం సర్టిఫికేట్లను సమర్పించాలని, తమ దరఖాస్తులను హెటీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా చేయాలని మురళీ సూచించారు.

వెంకటనగరం మరమ్మతులకు నిధులివ్వండి
ఇరిగేషన్ అధికారులను కలిసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ


అమరావతిలో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారిని కలిసి విజ్ఞప్తి చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): అమరావతి పర్యటనలో భాగంగా శుక్రవారం డిప్యూటీ ఫైనాన్సియల్ అడ్వైజర్ కె.లక్ష్మినాయక్‌ను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కలిసి వెంకటనగరం కొత్త పంపింగ్ స్కీమ్ నిర్వహణ, మరమ్మతుల విషయమై చర్చించి వినతి పత్రం అందజేశారు. ఈ స్కీంలో పంప్‌హౌస్‌లు, కాలువ పనులు పూర్తయ్యాయని, భూమి సేకరణ సమస్యల వల్ల ఇప్పటి వరకు మిగిలిన పనులు పూర్తికాలేదన్నారు. ప్రస్తుతం ఈ పంపింగ్ స్కీం ద్వారా 10,611 ఎకరాలకు సాగు నీరందుతోందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా 2022-23 సంవత్సరానికి రూ.2.48 కోట్లు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని మంజూరు చేయాలన్నారు. తద్వారా వ్యవసాయ భూములకు నిరంతర సాగునీరు అందించవచ్చన్నారు. ఈ నిధుల మంజూరు వల్ల పంప్‌హౌస్‌లు, కాలువల సమర్థవంతమైన నిర్వహణ సాగుతుందని విజ్ఞప్తి చేశారు.

ప్రకృతి వ్యవసాయం సాగుతో అధిక దిగుబడి
జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

దివాన్‌చెరువు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం సాగుతో అధిక దిగుబడి, సంపూర్ణ పోషకాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. శ్రీకృష్ణపట్నంలో భారత రైసింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చైతన్య పోలవరపు, చెల్లుబోయిన మూర్తి సాగు చేస్తున్న పండ్ల తోటల ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం అధికార్లు, వ్యవసాయాధికార్లు సందర్శించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి సాగులో రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించరాదన్నారు. పొలాల్లో నవధాన్యాల ఎండీఎస్ విత్తనాలను వెదజల్లిన 45 రోజులకు మొక్కలు ఎదిగిన తర్వాత పొలాన్ని దుక్కి దున్నించాలన్నారు. తద్వారా భూసారం పెరుగుతుందని భూమిలో కార్బన్ డైఆక్సైడ్, నైట్రోజన్ వంటి ప్రకృతి సిద్ధ ఎరువులుగా మారి పంటకు పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ బి.తాతారావు, ఏడీపీఎం వల్లీ, ఏపీ రైతు సాధికార సంస్థ రాష్ట్ర అకాడమీలీడ్ సుధాకర్, అధికారులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరించుకోవాలి
అనపర్తి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ


అనపర్తిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్జి వంశీకృష్ణ

అనపర్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కోర్టులో కేసులు ఉన్న కక్షిదారుల కేసుల పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ న్యాయవాదుల ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం అనపర్తి కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధ్యవర్తిత్వ వారోత్సవాల సందర్భంగా ముద్రించిన కరపత్రాలను న్యాయమూర్తి ఆవిష్కరించారు. న్యాయవాదులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంలో పరిష్కారానికి వీలున్న కేసుల్లో న్యాయ శాఖ నియమించిన మధ్యవర్తుల ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని, అనపర్తి కోర్టుకు న్యాయవాదులు కోనాల శ్రీధర్ రెడ్డి, వెలగల లక్ష్మీనారాయణరెడ్డిలను నియమించినట్టు తెలిపారు. రాజీ కుదరకపోయినప్పటికీ దీని ప్రభావం కేసులపై ఉండదని అయితే రాజీ పడ్డ కేసులకు అప్పీలు చేసుకునే వీలు ఉండదన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మేడపాటి రవిషణ్ముఖరెడ్డి, ఆర్‌వీజీ పట్నాయక్, ద్వారంపూడి భాస్కరరెడ్డి, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రంగంపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పొలానికి గడ్డి మందు పిచికారీ చేసిన దాని ప్రభావానికి లోనై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్‌ఐ వీవీ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. రంగంపేట గ్రామానికి చెందిన చెక్కపల్లి వీరవెంకట దుర్గారావు ఈ నెల 9న తన పొలంలో గడ్డి మందును పిచికారీ చేశాడు. ఆ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో మందు ప్రభావానికి లోనయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చి స్పృహతప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు రంగంపేటలోని ప్రైవేటు హాస్పటల్‌లో చేర్పించారు. అక్కడి నుంచి కాకినాడ మెడికోవర్ అసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం నిమిత్తం 10వ తేదీ రాత్రి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి సోదరుడు చెక్కపల్లి గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

రంగాపురం పాఠశాలకు మెగాఫోన్ బహూకరణ


హెచ్‌ఎంకు మెగాఫోన్ అందిస్తున్న బదిలీపై వెళ్లిన టీచర్లు

బిక్కవోలు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రంగాపురం మోడల్ ప్రైమరీ పాఠశాలకు బదిలీపై వెళ్లిన టీచర్లు గోపాలకృష్ణ, వెంకటేశ్, లక్ష్మినారాయణరెడ్డి, కె.గోపాలకృష్ణ, విజయకుమారి మెగాఫోన్‌ను శుక్రవారం బహూకరించారు. దీనిని ఎంపీటీసీ యేసురత్నం, కూటమి నేతలు చిరంజీవిరాజు, జోష్‌బాబు, గౌరిశంకర్ చేతుల మీదుగా హెచ్‌ఎం రవికుమార్‌కు అందజేశారు. అనంతరం బదిలీపై వెళ్లిన టీచర్లను పాఠశాల తరఫున సత్కరించారు. కార్యక్రమంలో టీచర్లు శ్రీనివాసరెడ్డి, సతీష్‌కుమార్, శ్రీనివాసరావు, సంధ్యారాణి, వీరలక్ష్మి పాల్గొన్నారు.

అనపర్తిలో రూ.452 కోట్ల అభివృద్ధి పనులు
ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


ఈలకొలనులో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో అనపర్తి నియోజకవర్గంలో రూ.452 కోట్ల అభివృద్ధి పనులు, రూ.314 కోట్ల సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఏడాది పాలనలో నియోజకవర్గంలో జరిగిన ప్రగతిని వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అస్తవ్యస్తంగా మారిన అనేక రోడ్లకు మరమ్మతులు చేపట్టామన్నారు. అనపర్తి రైల్వే స్టేషన్‌ను రూ.30 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, అనపర్తి కొత్తూరు, లక్ష్మీనరసాపురం, ఇళ్లపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. కెనాల్ రోడ్డుకు మోక్షం కలిగించామన్నారు. అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని ఆయన వైసీపీ నేతలకు హితవు పలికారు. సమావేశంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

మహేంద్రవాడ, ఈలకొలనులో పర్యటన

అనపర్తి/ రంగంపేట, జూలై 11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన అనపర్తి మండలం మహేంద్రవాడ, రంగంపేట మండలం ఈలకొలను గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాల వివరాలు తెలియజేస్తూ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. గ్రామస్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాదిలో మహేంద్రవాడలో రూ.8.34 కోట్లు, ఈలకొలనులో రూ.7.52 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, గిరజాల సత్తిబాబు, పూసల శ్రీను, పోతుల వెంకట్రావు, అడబాల వెంకట్రావు, కడిమి సాయిబాబు, ఉండవిల్లి గిరిబాబు, యడ్ల గణేష్ పాల్గొన్నారు.

గర్భధారణల మధ్య సరైన అంతరం పాటించాలి

» జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు
» ప్రపంచ జనాభా దినోత్సవం



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గర్భధారణల మధ్య సరైన అంతరాన్ని పాటించడం ద్వారా తల్లి, బిడ్డల ఆరోగ్యాన్ని పరిరక్షించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బొమ్మూరులోని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయం నుంచి బొమ్మూరు వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గర్భధారణల మధ్య అంతరం కేవలం మాతృత్వ సంబంధిత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ సంక్షేమానికి కూడా అవసరమన్నారు. ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం, అంతరం ఈ ఏడాది నినాదమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో సత్యకుమార్ నల్లూరి, డీఎస్‌వో డాక్టర్ టి.రాజీవ్, డిప్యూటీ ఎస్‌వో భాస్కర్, సీహెచ్‌వో శర్మ, ఎంపీహెచ్‌ఈవోలు బి.రాజు, బాపిరాజు, మూర్తి, శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఎస్(ఎం) ప్రసాద్, శ్రీనివాస్, రాజేశ్వరరావు, సురేష్, కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద డాక్టర్లు ఎం.శైలజారాణి, సునీల్, ఏసురాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏవీకె చైతన్య మాట్లాడుతూ జనాభా నియంత్రణకు ప్రతి కుటుంబంలో ఒక్కరు లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలని, ఆడ పిల్లలకు 18 ఏళ్లు దాటిన తరువాతే వివాహాలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు నివారించాలని, దంపతులు కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: జీజీయూ ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు.ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో మానవ వనరులు ప్రముఖ పాత్ర వహిస్తాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని జనాభా ఉండే వనరులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు.కార్యక్రమంలో జీజీయూ డీన్ బి.శ్రీనివాసరాజు, హెల్త్‌సైన్స్ విభాగాధిపతి శ్వేత ప్రశాంతి పాల్గొన్నారు.

బీఎల్‌వోల పనితీరు మెరుగుపడాలి : కలెక్టర్


బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): బూత్ లెవెల్ అధికారులు(బీఎల్‌వో)కు ఇక్కడ ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని పనితీరు మెరుగుపరుచుకోవాలని జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో శుక్రవారం బీఎల్‌వోలకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఓటర్ల జాబితా తయారీలో బీఎల్‌వోలు బాధ్యతయుతంగా వ్యవహరించాలన్నారు. ఫారం 6, 6ఎ, 7, 8, ఓటర్ల జాబితా తయారీ, మార్పులు, చేర్పులు మరణించిన వారు, వలస వెళ్లిన వారి వివరాలు పరిశీలించి తుది సమాచారం ఏవిధంగా అందించాలో సూచించారు. విధి నిర్వహణలో బీఎల్‌వోలు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా ఎన్నిలకు సంబంధించి ప్రాథమిక అంశాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. భారత రాజ్యాంగంలో అధికరణలు, ఎన్నికలకు సంబంధించి ప్రజా ప్రతినిధ్య చట్టం, ఎన్నికల నమోదు చట్టం తదితర చట్టాలలోని ముఖ్యమైన సెక్షన్లపై కనీస అవగాహన ఉండాలన్నారు. అలాగే బీఎల్‌వో పత్రికను ప్రతి ఒక్కరూ తప్పక చదవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, డీసీ ఎస్.వెంకటరమణ, మేనేజరు అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నన్నయ వీసీకి నెల్సన్ మండేలా ఇన్‌స్పైర్ అవార్డ్



దివాన్‌చెరువు, జూలై11(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకి 2025 సంవత్సరానికి ప్రతిష్టాత్మక నెల్సన్‌మండేలా ఇన్‌స్పైర్ అవార్డు లభించింది. వీసీ ప్రసన్నశ్రీ స్ఫూర్తిదాయకత, ధైర్యసాహసాలు, సానుకూల మార్పునకు చూపే అంకిత భావం ప్రపంచ ఐకాన్ నెల్సన్ మండేలా శాశ్వత వారసత్వంతో ప్రతిధ్వనిస్తూ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఫేమస్ పీపుల్ ఇండియా వరల్డ్ సంస్థ నుంచి ఈ పురస్కారం లభించింది. గురువారం రాత్రి ఆన్‌లైన్‌లో ఈ అవార్డును ఆమె అందుకున్నారు. భాషాశాస్త్రం, విద్యారంగంలో ప్రసన్నశ్రీ చేసిన అద్భుతమైన కృషి జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలు అందుకుంది.

14 నుంచి నన్నయలో ఎఫ్‌డీపీ

నన్నయ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల14 నుంచి 19వ తేదీ వరకూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) నిర్వహిస్తున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ శుక్రవారం తెలిపారు. క్వాంటం టెక్నాలజీస్ ఆపర్చునిటీస్ అండ్ త్రెట్స్ అనే అంశంపై ఈ ఎఫ్‌డీపీ జరుగుతుందన్నారు. ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ నుంచి దీనికి అనుమతి లభించిందన్నారు. దీనికి కోఆర్డినేటర్‌గా వి.పెర్సిస్, అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా జి.కీర్తిమరీటా వ్యవహరిస్తారన్నారు. నమోదు చేయించుకున్న వారంతా ఈ కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని సూచించారు.

ఆర్టీసీ ఆషాఢ మాసం
అష్టదేవతల తీర్థయాత్ర
18న మరికొన్ని బస్సుల ఏర్పాటు
డిపో మేనేజర్ మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం అష్టదేవతల దర్శన తీర్థయాత్ర బస్సు 50మంది భక్తులతో శుక్రవారం ఉదయం రాజమహేంద్రవరం డిపో నుంచి బయలుదేరింది. డిపో మేనేజర్ మాధవ్, అసిస్టెంట్ మేనేజర్ విజయ్‌బాబు ఈ బస్సును ప్రారంభించారు. ఈ యాత్రలో కడియపులంక, చింతలూరు, మట్లపాలెం, కోపూరు వారావిమాత, పిఠాపురం, తాటిపర్తి, పెద్దాపురం, కాండ్రకోట ప్రాంతాల్లోని అష్టదేవతలను దర్శించుకుని తిరిగి రాజమహేంద్రవరం చేరుకుంటుందని డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. అలాగే, ఈనెల 18న మరికొన్ని అష్టదేవతల తీర్థయాత్ర బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, టిక్కెట్లు కావాల్సిన వారు సెల్ నెం. 95023 00189, 73829 12141లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఉచిత వైద్య శిబిరం

గోకవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామరాజుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గోకవరం ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యులు విద్యార్థులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ పాలూరి బోస్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కదుల బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు
ఉచిత బస్సు సౌకర్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంను వచ్చేనెల 15 నుంచి కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శుక్రవారం స్థానిక 9వ డివిజన్‌లో ఇన్‌చార్జి కోసూరి చండీప్రియ పర్యవేక్షణలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. పథకాల అమలు తీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.

స్థానిక అన్నపూర్ణంపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే వాసు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం

సీతానగరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగవరంలోని జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. ముగ్గుళ్ల గ్రామానికి చెందిన అప్పలరాజు తన భార్యతో కలసి సింగవరంలోని అల్లుడి ఇంటి దగ్గరలో పాకలో నివాసముంటున్నారు. శుక్రవారం ఉదయం 10 గంలకు గ్యాస్ సిలిండర్ పేలిపోవడంతో అగ్నిప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇంటిలో ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పలు గృహోపకరణాలు, విలువైన పత్రాలు, రూ.30 వేలు నగదు కాలిబూడిదయ్యాయని బాధితులు తెలిపారు.

707 మద్యం సీసాలు ధ్వంసం

అనపర్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): అనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు, సారాను శుక్రవారం ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ శ్రీను నాయక్ తెలిపారు. జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ నాగ రాహుల్ సమక్షంలో 2023 నుంచి గత నెలాఖరు వరకు 41 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 707 మద్యం సీసాలను, 146 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐ సుమంత్, ఏఎస్‌ఐ దుర్గాప్రసాద్, వీఆర్‌వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గైట్ కళాశాలకు సౌరశక్తి దీపాలు

రాజానగరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీజీయూ ప్రాంగణంలోని గైట్ స్వయం ప్రతిపత్తి కళాశాలకు ముంబై ఐఐటీలోని ఎనర్జీ స్వరాజ్ ఫౌండేషన్ ఐదు సౌరశక్తి దీపాలను బహుమతిగా అందజేసినట్టు ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ గైట్ అటానమస్ కళాశాలలోని ఆటోమెటిక్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంధన అక్షరాస్యతపై 2500 మందికి పైగా విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు.

విద్యార్థినికి ఎంజేఎన్ ఆర్థిక సాయం

బిక్కవోలు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొంకుదురు ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణురాలైన రెడ్డి శ్రావ్యవర్షితకు హైదరాబాద్‌కు చెందిన ఎంజే నాయుడు ట్రస్ట్ రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. శుక్రవారం పాఠశాలలో ఈ చెక్కును సర్పంచ్ సత్తి వీరమణి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి చేతుల మీదుగా వర్షితకు అందజేశారు.

కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కడియం, జూలై 11(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో కామర్స్ సబ్జెక్టు బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీకేఆర్ చౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీలో సంబంధిత సబెక్టులో 50శాతం మార్కులు పొంది ఉండాలని, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యమిస్తామన్నారు. అభ్యర్థులు కళాశాల ఆఫీసులో దరఖాస్తు అందజేయాలని ప్రిన్సిపాల్ చెప్పారు.

మురమండ సొసైటీ చైర్మన్‌గా జానకిరామయ్య



కడియం, జూలై 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని మురమండ వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిమేన్ కమిటీ చైర్మన్‌గా వట్టికూటి జానకిరామయ్య (దత్తుడు) నియమితులయ్యారు. సభ్యులుగా మాధవరాయుడుపాలేనికి చెందిన అన్నందేవుల వీరభద్రరావు, దుళ్లకు చెందిన తూము శ్రీను నియమితులయ్యారు.ఈ మేరకు తమకు నియామక ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. నూతన త్రిమేన్ కమిటీని దేవళ్ల రామ్మోహనరావు, కూటమి నాయకులు అభినందించారు.

రేపు రాజానగరం జనశ్రేణుల ఆత్మీయ సమావేశం

రాజానగరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ జనశ్రేణుల ఆత్మీయ సమావేశం ఈ నెల 13న రాజానగరంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాల్లోని అన్ని గ్రామాలకు చెందిన జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు ఆదివారం ఉదయం 10 గంటలకు రాయల్ ఫంక్షన్ హాల్లో జరిగే సమాశానికి విధిగా హాజరుకావాలన్నారు.

గంజాయి, డ్రగ్స్‌తో అనర్థాలు

కోరుకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగట్లలో వికాస్ ఫార్మశీ కళాశాలలో శుక్రవారం నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్, ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ సైబర్ నేరాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ మాయలో పడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమలత, తన్నీరు ఉదయభాస్కర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ



దివాన్‌చెరువు, జూలై11 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు గ్రామ దేవత శ్రీకనకదుర్గమ్మ ఆషాఢమాసం సందర్భంగా శుక్రవారం శాకంబరిగా దర్శనమిచ్చారు. స్థానిక పాత పంచాయతీ కార్యాలయం పక్కన గల ఆలయంలో దుర్గమ్మను వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. అలాగే ఆలయాన్ని ఆకుకూరలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. దుర్గమ్మ ఆలయం పక్కనే కొలువై ఉన్న ప్రసన్న వినాయకుడు, ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరుడు, నందీశ్వరుడు విగ్రహాలను, శివలింగాన్ని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని, స్వామివార్లను దర్శించుకున్నారు.

అనపర్తి: అనపర్తి గ్రామ దేవత వీరుళ్లమ్మను సుమారు 510 కిలోల కూరగాయలతో అలంకరించారు. శాకంబరి అలంకరణలో ఉన్న అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఏపీ పేపర్ మిల్లు లాకౌట్
ఆందోళన కొనసాగిస్తున్న కార్మికులు

కొవ్వూరులో పరిణామాలపై
జనసేన విచారణ 8

డబ్బులు వసూలు చేస్తే.. సస్పెండ్ చేస్తా

పింఛన్ పంపిణీదారులకు కలెక్టర్ ప్రశాంతి హెచ్చరిక



నల్లజర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి అందించాలని..వారి నుంచి ఎవరైనా డబ్బులు వసూళ్లు చేస్తే వెంటనే సస్పెండ్ చేస్తానని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. పింఛన్ ఇవ్వలేదని..పింఛన్‌దారుల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్టు ఐవీఆర్‌ఎస్ కాల్‌లో జగన్నాథపురం గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ మేరకు కలెక్టర్ క్షేత్రస్థాయి పరిశీలన నిమిత్తం జగన్నాథపురం గ్రామ సచివాలయానికి విచ్చేసి రికార్డులు పరిశీలించారు.పింఛన్ ఏ విధంగా పంపిణీ చేస్తున్నారని నిలదీశారు. ఉదయం పనులకు వెళ్లే కూలీలు సచివాలయానికి వచ్చి కూర్చోవడంతో కొంత మందికి పింఛన్ అందించినట్టు సిబ్బంది చెప్పారు.దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికెళ్లి పింఛన్ అందించాలన్నారు.పింఛన్లకు డబ్బులు వసూళ్లు చేయడంపై విచారించాలని అక్కడే ఉన్న డీఆర్‌డీఏ పీడీ వీవీఎస్ మూర్తిని ఆదేశించారు.జిల్లావ్యాప్తంగా 512 సచివాలయాల్లో రాని అసంతృప్తి జగన్నాథపురంలో వచ్చిందన్నారు.ఈ నెలలో అనపర్తి 2 సచివాలయం 100 శాతం పింఛన్ అందించి ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రైతులకు సబ్సిడీపై అందించిన పచ్చిరొట్ట విత్తనాల్లో 50 శాతం మాత్రమే మొలకెత్తాయని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు.దీనిపై దృష్టి పెట్టాలని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావుకు సూచించారు.కార్యక్రమంలో తహశీల్దార్ నాయుడు, ఎంపీడీవో సింహాద్రిరావు, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి,మాజీ సర్పంచ్ యలమాటి శ్రీనివాసరావు, నిమ్మలపూడి ప్రసాద్,ఏవో సోమశేఖర్ పాల్గొన్నారు.

గంటల వ్యవధిలోనే మిస్సింగ్ కేసుల ఛేదన

ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఇప్పటి వరకూ నమోదైన 24 మంది మహిళలు, చిన్న పిల్లల మిస్సింగ్ కేసులను గంటల వ్యవధిలోనే ఛేదించడం జరిగిందని ఎస్పీ నరసింహ కిశోర్ శుక్రవారం తెలిపారు. మహిళలు, బాలికలపై దాడులను అరికట్టడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. వారికి అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని చెప్పారు. శక్తి టీమ్‌ల ద్వారా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నామన్నారు. ఉమెన్స్ హాస్టల్‌లో పాయింట్ బుక్స్ పెట్టి తరచుగా శక్తి టీమ్స్ సందర్శించడం జరుగుతుందన్నారు.రాత్రి సమయాల్లో అసాంఘిక శక్తులను అరికట్టడానికి 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో సులువుగా సమాచారాన్ని మార్పిడి చేసుకునే విధంగా ప్రజలు, పోలీసులతో కలిపి 100 వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా అల్లరిమూకలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు.



వానోకాలం!

గతేడాది వద్దంటే వానలు..ఇప్పుడేమో..?



జూలైలో ఈ పది రోజులు పరిశీలిస్తే ఒకటీ రెండు మండలాలు మినహా ఉమ్మడి జిల్లాలో అన్నీ లోటు వర్షపాతం కిందే రెడ్ మార్కులోకి వెళ్లిపోయాయి. సాధారణ వర్షపాతం కంటే తక్కువగానే సూచీలు హెచ్చరిస్తున్నాయి. గడచిన 40 రోజుల వర్షపాతం లెక్కలు పరిశీలిస్తే వర్షాభావం తీవ్రత చాటుతోంది. అనేక మండలాల్లో అసలు చినుకు జాడలేదు. జిల్లాల వారీగా పరిశీలిస్తే గత నెల జూన్ 1 నుంచి ఈ నెల 10 వరకు కాకినాడ జిల్లా వ్యాప్తంగా సరాసరి వర్షపాతం 147.58 మి.మీ.లకు 160.48 మి.మీ. కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో 178.11 మి.మీలకు 192.28 మి.మీ. నమోదైంది. దీంతో ఈ రెండు జిల్లాలు సాధారణ వర్షపాతం జాబితాలో కొనసాగుతున్నాయి. కోనసీమ జిల్లాలో 174.33 మి.మీలకు కేవలం 132.24 మి.మీ. కురిసింది. దీంతో జిల్లా లోటు వర్షపాతం జాబితాలో ఉంది. జిల్లాల సరాసరి వర్షపాతం సాధారణంగా ఉండగా.. మండలాల వారీ పరిశీలిస్తే వర్షాభావ తీవ్రత కొంత ఆందోళనకు గురిచేస్తోంది. అదే సమయంలో కొన్ని మండలాల్లో ఏకంగా అదనపు వర్ష పాతం నమోదవడం విశేషం.

రుతుపవనాలు విస్తరించి చాలా వారాలు అవుతున్నా వీటి ప్రభావం ఈసీజన్‌లో పెద్దగా కనిపించడం లేదు. ఈపాటికే వర్షాలు ఎక్కడికక్కడ భారీగా కురవాల్సి ఉండగా చినుకుల జాడే కనిపించడం లేదు. పేరుకు ఆకాశంలో దట్టమైన మేఘాలు ఆవహించి భారీ కుండపోత వాన ఏక్షణమైనా కురుస్తుందన్నట్టు ఉంటున్నా తీరా గాలులు తప్పించి వాన జాడ ఉండడం లేదు. అటు దట్టమైన మేఘాల వల్ల వాతావరణం చల్లబడాల్సి ఉన్నా దీనికి భిన్నంగా ఎండలు మండిపోతున్నాయి. ఫలితంగా వర్షపాతం ఆందోళన కలిగిస్తోంది. - (కాకినాడ,ఆంధ్రజ్యోతి)

రుతుపవనాలు విస్తరించినా కానరాని వానలు

- ఉమ్మడి జిల్లాలో వర్షపాతం అరకొరే
- కాకినాడ, తూర్పున సాధారణం
- కోనసీమలో 15 మండలాల్లో లోటు
- గతేడాది జూన్‌లో భారీ వానలు
- ఈ ఏడాది చూస్తే కానరాని జాడ
- ఆందోళనలో రైతాంగం

ఉమ్మడి జిల్లాలో చినుకు జాడ కరువైంది.. రుతు పవనాలు వచ్చేసినా వరుణుడి జాడ కానరావడం లేదు.. దట్టమైన మేఘాలు ఆవరించినా గాలులే తప్ప చుక్క చినుకు రాలడం లేదు.. ఈ పాటికే భారీ వర్షాలతో జిల్లాలో అదనపు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలు సాధారణ వర్షపాతంతోనే నెట్టుకొస్తున్నాయి. అటు కోనసీమ జిల్లా లోటు వర్షపాతంతో కలవరపాటుకు గురవుతోంది. గతేడాది ఈ పాటికే వానలు దంచి కొట్టాయి.ఈ సారి జూన్ నుంచి ఈ నెల జూలైలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వర్షాల్లేకపోవడం అన్నదాతలను కలవరపాటుకు గురిచేస్తోంది.

అప్పుడే నయం..

మే నెలలో కాకినాడ జిల్లా అంతా కలిపి 109.77 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 115.48 మి.మీ. నమోదైంది. జూన్‌నెలలో 96.57 మి.మీలకు 120.75 మి.మీ. నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో మేలో 78.56 మి.మీ.కు 136.54 కురవగా, జూన్‌లో 107.77 మి.మీకు 145.27 మి.మీ. కురిసింది. కోనసీమ జిల్లాలో మేలో 72.55 మి.మీకు 130.88 మి.మీ. కురవగా, జూన్‌లో 102.37 మి.మీ వర్షపాతానికి 108.25 మి.మీ కురిసింది. 2024లో జూన్ నెలలో కాకినాడ జిల్లాలో 112.8 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే .210.2 మి.మీ కురిసింది.. కోనసీమలో 111.4కి 175.3 మి.మీ నమోదైంది. తూర్పుగోదావరి జిల్లాలో 117.0కి 198.3 కురిసింది. గతేడాది జూలైలో కాకినాడ జిల్లా 198.0 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 223.8 మి.మీ. కురిసింది. కోనసీమలో 241కి 339.9 మి.మీ, తూర్పుగోదావరి జిల్లాలో 247.1కు 374.7 మి.మీ. కురిసింది. కానీ ఈ ఏడాది జూలైలో మాత్రం మొత్తం లోటు వర్షపాతం కొనసాగుతోంది.

కాకినాడలో లోటు

కాకినాడ జిల్లాలో మొత్తం 21 మండలాలకు 18 మండలాల్లో సాధారణ వర్షపాతమే కొనసాగుతోంది. మూడు మండలాల్లో అవ సరానికి మించిన వాన నమోదైంది. అందులో గొల్లప్రోలు మండలం జిల్లాలో అన్నింటికంటే అదనపు వర్షపాతంతో కొనసాగుతోంది.ఇక్కడ గడచిన 40 రోజుల్లో 66.17 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా 106.11 మి.మీ. కురిసింది.కోట నందూరులో 103.07 మి.మీ.లకు 173.97 మి.మీ కురిసింది. తొండంగి మండలంలో 145.28 మి.మీకు 182.06 మి.మీ కురిసింది..అదే ఈ నెల పది రోజుల జిల్లా సరాసరి వర్షపాతం తీసుకుంటే 51.16 మి.మీ. కురవాల్సి ఉంటే 39.71 మి.మీ కురిసి లోటు కొనసాగుతోంది.

తూర్పున ఇలా...

తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 19 మండలాలకు 14 మండలాల్లో సాధారణ వర్షపాతం ఉండగా ఐదు మండలాల్లో మాత్రం అదనపు వర్షపాతం నమోదైంది.చాగల్లు మండలంలో గడచిన 40 రోజుల్లో 155.61 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 203.33, దేవరపల్లిలో 162.71కి 225.13, కొవ్వూరులో 166.3కు 213.56, నల్లజర్లలో 151.38కి 215.41, రాజమండ్రి అర్బన్‌లో 173.64కి 208.69 మి.మీ. వర్షపాతం నమోదైంది.

కోనసీమలో కలవరం..

కోనసీమ జిల్లాలో మొత్తం 22 మండలాలు ఉంటే ఏకంగా 15 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. గడచిన 40 రోజుల్లో అయినవిల్లి మండలంలో 188.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 123.14 మాత్రమే కురిసింది.అల్లవరం 182.85కు 131.51, అమలాపురం 187.65కు 128.54 మి.మీ,అంబాజీపేట 183.81కి 131.12, ఐ.పోలవరం 165.57కు 119.03, కాట్రేనికోన 177.89కి 120.36, మామిడికుదురు 181.27కి 134.3, ముమ్మిడివరం 188.42కి 120.72, పి.గన్నవరం 183.9కి 134.84,పామర్రు 156.26కి 119.78, రామచంద్రపురం 153.69కి 120.7, రాయవరం 166.61కి 123.9, రాజోలు 191.98కి 139.97, సఖినేటిపల్లి 208.17కు 144.04,ఉప్పలగుప్తం 172.93కు 124.86 మి.మీ. వర్షపాతమే నమోదైంది.కోనసీమలోనే లోటు అధికంగా ఉంది.

రాతలు చెరిగాయ్!



- రాళ్లపై జగన్ బొమ్మ తొలగింపు
- వైసీపీ రాతలూ చెరిపేశారు
- ఆగస్టు నుంచి కొత్త పాస్ బుక్స్
- 31 గ్రామాల్లో కూటమి సర్వే
- సర్వే నెంబర్లు ఇక గురుతులే
- ఎల్‌పీఎం, పీపీఎం పేరిట అమలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

సరిహద్దు రాళ్ల మీద జగన్ బొమ్మను తొలగించారు.వాటితో పాటు రాళ్ల మీద వైఎస్‌ఆర్ జగనన్న భూరక్షణ 2020 అనే రాతలు తొలగించారు. ఇక కొత్త పాసు పుస్తకం వచ్చింది. ఆగస్టు నుంచి పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. దాని మీద గత వైసీపీ ప్రభుత్వంలో మాదిరిగా సీఎం బొమ్మల వంటి దరిద్రం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ,సింబల్ ఉంటుంది. రెవెన్యూశాఖ పేరు ఉంది. సింబల్ పైన భూమి యాజమాన్యపు హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకం అని మాత్రం ఉంది. భూమి యజమాని ఫోటో, వారి వివరాలు అందులో ఉన్నాయి. గత ప్రభుత్వం జిల్లాలో 163 గ్రామాల్లో 2,14,319 రాళ్లు పాతి దానిపై బొమ్మలు వేసింది. రాతలు రాసింది. ఈ ప్రభుత్వం వాటిని తొలగించి ఆనవాళ్లు లేకుండా చేసింది.

జిల్లాలో 6 లక్షల ఎకరాలు

జిల్లాలో మొత్తం 272 గ్రామాల్లో 605331.86 ఎకరాల విస్తీర్ణం ఉంది. రాజమహేంద్రవరం డివిజన్ 10 మండలాల పరిధి 123 గ్రామాల్లో 299963.2 ఎకరాలు, కొవ్వూరు డివిజన్ 9 మండలాల పరిధి 149 గ్రామాల్లో 315268.66 ఎకరాలు ఉన్నాయి. 2020లో అప్పటి వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో కొన్ని గ్రామాల్లో సర్వే చేసి పాస్ పుస్తకాల మీద జగన్ బొమ్మ ముద్రించిన సంగతి తెలిసిందే. సరిహద్దు రాళ్ల పేరిట రాళ్లు వేసి వాటిపై జగన్ బొమ్మతో పాటు వైఎస్‌ఆర్ జగనన్న భూరక్ష అనే రాతలు రాసిన సంగతి తెలిసిందే. దీంతో ప్రజల్లో పెద్ద అలజడి మొదలైంది. అప్పట్లో తెలుగుదేశం కూటమి పార్టీలు వ్యతిరేకించాయి. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ చట్టాన్ని రద్దు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024 ఎన్నికల్లో విజయం సాధించడంతో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం భూహక్కు చట్టాన్ని రద్దు చేశారు. అంతేకాకుండా పైలెట్ గ్రామాల పేరుతో రీసర్వే ఆరంభించారు. మొదట 16 గ్రామాలు, రెండో దశ 15 గ్రామాల్లోనూ సర్వే చేస్తున్నారు. సర్వే వేగంగా జరుగుతోంది.ఈ నెల 14 నుంచి మిగతా గ్రామాల్లో సర్వే ఆరంభిస్తారు. నవంబరు నాటికి పూర్తి చేసే యోచనలో ఉన్నారు.

సర్వే నంబర్ ఉండదు..

ఇంతవరకూ మీ భూమి ఎక్కడ ఉందని అడిగితే సర్వే నంబర్ చెప్పేవారు. ఇక సర్వే నంబర్ అనే మాట వినిపించదు. ఇప్పటికే రీ సర్వే జరిగిన ప్రాంతాల్లో సర్వే అనే మాటను తొలగిస్తున్నారు. వ్యవసాయ భూమికి సంబంధించిన లాండ్ పార్శిల్ మ్యాంప్ (ఎల్‌పీఎం)ను అమల్లోకి వచ్చారు. ఒక చోట ఒకరికి చెందిన భూమి అంతా ఒక ఎల్‌పీఎం నంబర్‌లోకి వస్తుంది. ఇక ఇళ్ల స్థలాలు,ఇళ్లు, ఇతర ఆస్తుల విషయాల్లో ప్రాపర్టీ పార్శిల్ మ్యాప్ (పీపీఎం)ను వాడతారు.ఒక వ్యక్తికి సంబంధించిన స్థలానికి ఒకే పీపీఎం నంబర్ ఇస్తారు. ఆన్‌లైన్‌లో ఈ నెంబర్‌తోనే సంబంధిత ఆస్తి ఉంటుంది. ఇక గజాల కొలతలు మానేస్తున్నారు. చదరపు మీటరులోనే కొలతలు లెక్కలు చూపిస్తారు. ఎకరానికి 4046. 856 చదరపు మీటర్లు అని అర్థం .

11 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

ఇసుక ర్యాంపులపై ఆకస్మిక దాడులు

రాజమహేంద్రవరం/రూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో ప్రతిరోజు రాత్రి పగలు తేడాలేకుండా డ్రెడ్జింగ్ బోట్లు ఇసుకను తోడేస్తున్నాయి. గామన్ బ్రిడ్జికి సమీపంలో డ్రెడ్జింగ్ పెద్దఎత్తున జరుగుతుంది. లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక బోట్ల నుంచి రేవులకు చేరి అక్కడ నుంచి లారీల్లో సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో డ్రెడ్జింగ్ బోట్లపై నిఘాపెట్టిన మైనింగ్ అధికారులు శుక్రవారం మెరుపుదాడి చేశారు. గామన్ బ్రిడ్జికి మత్స్యకారుల నివాసాలకు మధ్యలో అమ్మవారి ఆలయం పక్కనే నిలుపుదల చేసిన 8 డ్రెడ్జింగ్ బోట్లను గుర్తించి వాటిపై కేసులు నమోదు చేశారు. మాన్యువల్‌గా ఉన్నబోట్లను వదిలేశారు. దీంతో కాతేరు ,కోటిలింగాల ఇసుక రేవులు ఉలిక్కిపడ్డాయి. ఎందుకంటే దాదాపుగా అన్ని రేవులు కూడా డ్రెడ్జింగ్ బోట్లను వినియోగించే ఇసుకను తోడేస్తున్నారు. ఈ ఘటనతో అఖండ గోదావరిలో డీసిల్టేషన్ పేరిట జరుగుతున్న అక్రమాలు బయటపడ్డాయి. గురు, శుక్రవారాల్లో అధికారులు తనిఖీలు చేసి ధవళేశ్వరం, కోటిలింగాల, కాతేరు ప్రాంతాల్లో అనధికారికంగా..నిబంధనలకు విరుద్ధంగా డ్రెడ్జింగ్ చేసే 11 బోట్లను అధికారులు సీజ్ చేశారు. ధవళేశ్వరంలో లలితాదేవి పేరుతో ఉన్న డ్రెడ్జింగ్ బోటులో ఉన్న భీమడోలు మండలం ఆగడాలలంకకు చెందిన ఘంటసాల ఏసురాజు, బాలకోటి రామ్మూర్తిని ఆరా తీయగా యజమానులెవరో తెలియదని చెప్పడం గమనార్హం.



డ్రెడ్జింగ్ బోట్లు పరిశీలిస్తున్న అధికారులు

కానీ విచారణలో విశాఖపట్నానికి చెందిన రాకేష్ ఈ బోటుకు యజమాని అని స్థానికంగా ఉన్న బిక్కన రవి అనే వ్యక్తి వీటిని పర్యవేక్షిస్తారని తేలినట్టు అధికారులు తెలిపారు.శ్రీలలిత బోటుతో పాటు శ్రీ లక్ష్మీ గణపతి వీరభద్రయ్య , సద్గురు శ్రీ సాయినాథ సాత్విక్ డ్రెడ్జింగ్ బోటు, శ్రీలక్ష్మీ డ్రెడ్జింగ్ బోటును సీజ్ చేశారు. రాజమండ్రి కోటిలింగాల, కాతేరు గోదావరి తీరంలో బోయజు రుతు పేరుతో ఉన్న డ్రెడ్జింగ్ బోట్లు 2, కోటేశ్వరరావు పేరుతో డ్రెడ్జర్ మౌంటెడ్ ఫైబర్ బోటు, సుబ్రహ్మణ్య ఆంజనేయశ్రీ శ్యామలాంబ మెకనైజ్డ్ బోట్లు, శ్రీశ్యామలాంబ అండ్ విఘ్నేశ్వర బోటు, శ్రీవిద్యానంపాట లక్ష్మి బోటు,మరో రెండు పేరు లేని బోట్లు స్వాధీనం చేసుకుని ఇరిగేషన్ ఏఈకి అప్పగించారు.

మళ్లీ పోలీస్ గ్రీవెన్స్ డే ఆరంభం

రాజమహేంద్రవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోలీసుల సమస్యలు పరిష్కరించడానికి, వారి సంక్షేమానికి ఈ గ్రీవెన్స్‌డే ఉపకరిస్తుందని అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన 10 మంది సిబ్బంది వారి ఇబ్బందులను వివరించారు. గత కొన్ని ఆగిపోయిన గ్రీవెన్స్‌డే మళ్లీ ప్రారంభం కావడంపై పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఇదే మొదటి పోలీస్ గ్రీవెన్స్ అని తెలుస్తోంది.. ఇప్పటి వరకూ సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి చెప్పడానికి వచ్చినా ఇబ్బందులు ఎదురయ్యేవి. ముఖ్యంగా హోంగార్డు నుంచి ఏఎస్ఐ వరకూ సెలవులు, అనుమతులు, లోన్లు, బదిలీలు తదితర విషయాలకు సంబంధించి సీఐ స్థాయిలోనే సమస్య ఆగిపోతోంది. జిల్లాలో ముగ్గురు అడిషనల్ ఎస్పీలు ఉన్నా వారిని గానీ,

పోలీసుల ఆనందం



అడిషనల్ ఎస్పీ సుబ్బరాజుకు సమస్యలను విన్నవిస్తున్న పోలీస్ సిబ్బంది

జిల్లా పోలీస్ బాస్ అయిన ఎస్పీని గానీ కలవడమంటే ఏడాదిగా వారికి సాహసమనే పరిస్థితి నడిచింది. ఎస్పీని కలవడానికి వెళితే సైంధవులు అడ్డుపడేవారని..ఇప్పుడు సమస్యలు స్వతంత్రంగా.. ఎలాంటి ఒత్తిడీ లేకుండా ఎస్పీకి చెప్పుకొనే అవకాశం కల్పించారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కొవ్వూరులో పరిణామాలపై విచారణ

రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని జనసేనాని పవన్ ఆదేశం

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలపై విచారించి నివేదిక ఇవ్వాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను జనసేనాని పవన్‌కల్యాణ్ ఆదేశించినట్టు సమాచారం. కొవ్వూరు నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి ప్రాధాన్యమివ్వడం లేదని ఆ పార్టీ నాయకుడు టీవీ రామారావు ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ అధిష్ఠానం కూటమి స్ఫూర్తికి విఘాతం కలిగించేలా చర్యలున్నాయంటూ నియోజకవర్గ ఇన్‌చార్జి పదవి నుంచి టీవీఆర్‌ను తప్పిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు జనసేన కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియా వేదికగా శుక్రవారం ఆందోళన చేపట్టడంతో పార్టీ అధిష్ఠానం స్పందించింది. కొవ్వూరులో ఉన్న పరిస్థితులను తెలుసుకుని, అన్నివర్గాలతో మాట్లాడి రెండువారాల్లో నివేదికివ్వాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్‌ను ఆదేశించింది.

నిడదవోలు ఆసుపత్రికి 100 పడకలు

• మంత్రి కందుల దుర్గేష్


నిడదవోలులో మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రిని 100పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న హ్యాండ్ ఆఫ్ హోప్ సంస్థ సేవలు అభినందనీయమని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫిశాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలు పట్టణంలోని చర్చిపేటలో ఉన్న బీసీ కమ్యూనిటీ హాలులో హ్యాండ్ ఆఫ్ హోప్ సహకారంతో బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చ్ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎన్నో వైద్య సదుపాయాలు అందిస్తున్నప్పటికీ ప్రైవేటు సంస్థల నుంచి ఈ తరహా ప్రోత్సాహం ఉంటే ప్రజలకు మరిన్ని సేవలందించవచ్చన్నారు. ప్రజలంతా ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, బండి సత్యనారాయణ,జువ్వల రాంబాబు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాలల సంక్షేమానికి రూ.45 వేల కోట్లు కేటాయించాలి

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మాలల సంక్షేమానికి రూ.45వేల కోట్ల నిధులు కేటాయించాలని మాలసంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాంరవిప్రకాష్ డిమాండ్ చేశారు.మాదిగ కార్పొరేషన్‌కు రూ.40వేల కోట్లు కేటాయించారని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొనడంపై హర్షం వ్యక్తం చేశారు. మాల,మాదిగలు రెండుకళ్లు అని పదేపదే చెప్పే చంద్రబాబు మాలల అభివృద్ధికి కనీసం రూ.45వేల కోట్లు కేటాయించాలన్నారు. ఎన్నికలలో అధికసంఖ్యలో టీడీపీకి ఓట్లు వేశారన్నారు. జగన్ ప్రభుత్వంలో దళితవర్గాలపై దాడులుచేసి, 26 పథకాలు రద్దు చేశారన్నారు. అందుకే వైసీపీని ప్రజలు ఓడించారన్నారు. తల్లికివందనం తరువాత కార్పొరేషన్‌లకు నిధులు మంజూరుచేసి కార్పొరేషన్ రుణాలను వెంటనే మంజూరు చేయాలన్నారు. కార్పొరేషన్లలో నిధులున్నాయో బహిర్గతంచేయాలన్నారు.

హామీలు అమలు చేశాం

• సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


చాగల్లు: గౌరిపల్లిలో తొలి అడుగు కార్యక్రమంలో మహిళ సమస్యలు వింటున్న ఎమ్మెల్యే ముప్పిడి


రామన్నపాలెంలో తొలి అడుగు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, జూలై11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జవాబుదారీ పాలన అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. మండలంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని రామన్నపాలెం, ధూమంతనగూడెం, సుబ్బరాయపురం, కృష్ణంపాలెం, యర్నగూడెం గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న ఏడాదిపాలనలో సంక్షేమ పథకాలు వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ఎమ్మెల్యే మద్దిపాటి ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను, సూపర్ 6 పథకాలను అమలు చేశామన్నారు. తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజల ఆదరణ కలుగుతుందన్నారు. ఈ రాష్ట్రాన్ని కాపాడటం కోసం సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణం, పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమాల్లో కాట్రు గడ్డ మోహన్, పరిమి శ్రీరామకృష్ణ, ముమ్మారెడ్డి సత్యనారాయణ, బిక్కిన నాగరాజు, బొల్లిన విజయభాస్కర్, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, కొయ్యలమూడి చినబాబు, పెనుమత్స సుబ్బరాజు, ముమ్మిడి సత్యనారాయణ, చిలకా రాజేశ్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు సూపర్

• ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూలై 11 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గౌరిపల్లిలో ఆయన పర్యటించి ప్రజలను కలిసి ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వాటికి సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉప్పులూరి శ్రీనివాసరావు, గద్దే వీర్రాజు, తాళ్ళూరి రామకృష్ణ పాల్గొన్నారు.

స్నేహపూర్వక మధ్యవర్తిత్వం అవశ్యం

• కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి అను రాధ



కొవ్వూరు పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్నేహపూర్వక మధ్యవర్తిత్వంతో శత్రుత్వం ముగుస్తోందని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ అన్నారు. శుక్రవారం కొవ్వూరు కోర్టు ప్రాంగణం నుంచి న్యాయవాదులు ఫల్కాఆర్డులు ధరించి నినాదాలు చేస్తూ లాంచీలరేవు మీదుగా విజయవిహార్ సెంటర్ వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా జడ్జి ఎం.అనూరాధ మాట్లాడుతూ రాష్ట్ర న్యాయాధికార సంస్థ ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టుల పరిధిలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై వారోత్సవాలను నిర్వహిస్తామన్నారు. మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు, కక్షిదారులు అవగాహన పెంచుకోవాలన్నారు. రాబోయే రోజులలో కోర్టులో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వర్రే మురళి, న్యాయవాదులు నీరుకొండ సూర్యనారాయణ, రాజాన శ్రీనివాస్, ఎం.నాగమణి, మీడియేటర్స్ టి.ప్రభాకర్, ఉప్పల కృష్ణారావు, వై.ప్రకాష్, ఎం.వెంకటేష్, ఎండీవీ ప్రసాద్, ఎ.సుందరీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతుడు మందపాటి రాజేశ్ (ఫైల్)

దేవరపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గొల్లగూడెంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గోపాలపురం మండలం వేలచింతలగూడెం గ్రామానికి చెందిన మందపాటి రాజేశ్(20) గొల్లగూడెంలో కేబుల్ ఫైబర్‌నెట్‌లో పోతుల శ్రీనివాస్‌వద్ద పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం గొల్లగూడెం దగ్గర కేబుల్‌వైర్‌ను ఎలక్ట్రికల్ స్తంభానికి కడుతు ండగా 11కేవీ విద్యుత్‌వైరు తగలటంతో నిచ్చెన పైనుంచి మందపాటి రాజేశ్ కిందపడటంతో తీవ్ర గాయాలైన అతనిని గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యాధికారులు తెలిపారు. కేసు నమోదు చేసి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

రాజేష్‌కు కన్నీటి వీడ్కోలు


రాజేష్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం: గడచిన ఎన్నికల్లో టీడీపీ తరపున తన కోసం కష్టపడి పనిచేసిన మందపాటి రాజేశ్‌కు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కన్నీటివీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కార్యకర్త రాజేశ్ మృతదేహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో తన కోసం కష్టపడి పనిచేసిన క్రియాశీలక కార్యకర్త మందపాటి రాజేశ్ మరణం తనను కలచివేసిందన్నారు. ఈ సందర్భంగా రాజేశ్ పనిచేస్తున్న కేబుల్ యజమాని నుంచి తక్షణ ఖర్చుల నిమిత్తం రూ.లక్షా 50వేలు అందజేశామన్నారు. అదేవిధంగా రాజేశ్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వం పొందాడని ఆయనకు పార్టీ నుంచి రూ.5లక్షలు అందేలా చూస్తానన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చానని అన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, గన్నమని చిట్టిబాబు, ఇళ్లారి రాము, జగదీశ్, రాజేంద్ర, కొర్లపాటి అన్నవరం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన ఉండాలి


ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉండ్రాజవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కుటుంబనియంత్రణ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉండ్రాజవరంలో జరిగిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. ప్రజలకు వివాహవ్యవస్థపై అవగాహన ఉండాలన్నారు. వివాహ వయస్సు మగవారికి 25, ఆడవారికి 21 సంవత్సరాలు అని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ కేడీవీ కుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గౌరీపట్నంలో జనాభా దినోత్సవ ర్యాలీ

దేవరపల్లి, జూలై11 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధమైన మాతృత్వం కోసం గర్భదారణ మధ్య ఆరోగ్యకరమైన సమయం ఉండాలని గౌరీపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ అధికారి శ్రీకృష్ణుడు పేర్కొన్నారు. మండలంలోని గౌరీపట్నంలో ప్రపంచ జనాభా దినోత్సవం సం దర్భంగా ఆశావర్కర్లు, వైద్యాధికారులు, సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక మాట్లాడుతూ గర్భదారణకు బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం మూడు సంవత్సరాలు గ్యాప్ ఉండాలన్నారు. కొత్తగా వివాహం చేసుకునే ఆడవారికి 21సంవత్సరాలు, మగవారికి 25 సంవత్సరాలు నిండి ఉండాల న్నారు. సీహెచ్‌వో శ్రీకృష్ణుడు, హెల్త్ ఎడ్యుకేటర్ రమణ, అశోక్ వర్ధన్, ఏఎస్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సేవాగుణంతో వైద్యం అందించండి

• డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు


నల్లజర్లలో చికిత్స పొందుతున్న రోగితో మాట్లాడుతున్న జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

నల్లజర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగి సేవాగుణంతో పనిచేయాలని జిల్లా వైద్యా ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నల్లజర్ల, పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో నల్లజర్ల, పోతవరంలో పెద్దసంఖ్యలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలకు రావడంతో వారితో మాట్లాడి వైద్యసేవలు ఏలా అందుతున్నాయని ఆరాతీశారు. ఓపీ రికార్డులు పరిశీలించారు. రోజుకు 120 మందికి పైగా ఓపీ రావడంపై డాక్టర్ గంగాధర్, డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్‌ను అభినందించారు. వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి ప్రజలకు మెచ్చేలా సేవలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో నేమాని వెంకట శాస్త్రీ, హెప్సిబా, సత్యనారాయణ, వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వి.వి. ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు జంక్ ఫుడ్‌పై అవగాహన

తాళ్లపూడి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి శ్రీ పరస పద్మరాజారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జంక్ ఫుడ్‌తో ఎదురయ్యే అనారోగ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ జంక్‌ఫుడ్ ఆరోగ్యానికి హానికరమని అన్నారు. సంస్థ అధ్యక్షుడు వెలుగుబంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు వాటి లాభాలు వివరిస్తూ ఇకపై జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్‌గా ఖర్జూరం అందించారు. ఉపాధ్యాయులకు పెన్నులు, విద్యార్థులకు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి అప్పన హనుమంతరావు, మాజీ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ తదతర సంస్థ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ4తో పేదల బతుకుల్లో వెలుగులు

చాగల్లు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పేదల బతుకుల్లో వెలుగులు నింపేందుకే ప్రభుత్వం పీ4 పథకంను ప్రారంభిస్తుందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. తెలుగు సంవత్సరాది ఉగాది నుంచి ఈపథకంను ప్రారంభించనున్నట్లు చెప్పారు. చాగల్లు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో జరిగిన పంచాయతీలకు ప్రగతి సూచికలు ప్రణాళికలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటుగా ప్రయివేట్ పబ్లిక్‌పీపుల్స్ పార్టనర్‌షిప్ కార్యక్రమంను అమలుచేసి పేదరికం నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు తహసీల్దార్ ఎం.మెరికమ్మ ఎంపీడీవో ఆర్.శ్రీదేవి పాల్గొన్నారు.

డైట్‌లో వ్యాసచరన పోటీలు

నల్లజర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): దూబచర్ల డైట్ కళాశాలలో జిల్లాస్థాయి వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కమలకుమారి పేర్కొన్నారు. శుక్రవారం తమ కళాశాలలో జిల్లాలో ఉన్న 6 పాఠశాలల నుంచి 21మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. విజేతలకు బహుమతులు అందజేశారన్నారు. అధ్యాపకులు గోవిందరాజు, ప్రసన్నకుమారి, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, సరోజిన పాల్గొన్నారు.

నీలాలమ్మకు సారె సమర్పణ


దొమ్మేరు గ్రామదేవత నీలాలమ్మ

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామదేవత నీలాలమ్మకు గ్రామస్థులు సారె సమర్పించారు. ఆషాడమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు స్థానిక శివాలయం నుంచి మేళతాళాలు, బాణాసంచా కాల్చుతూ, సారెతో ఊరేగింపుగా నీలాలమ్మ అమ్మవారి ఆలయం చేరుకున్నారు. చీర, సారె, పసుపు, కుంకుమ, గాజులు, అలంకరణ వస్తువులు, పువ్వులు, స్వీట్స్, వివిధ రకాల పిండి వంటకాలు అమ్మవారికి సమర్పించారు. అర్చకుడు ముసునూరి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నీలాలమ్మకు కుంకుమార్చన, లలితాపారాయణం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె

చాగల్లు: మండలకేంద్రమైన చాగల్లులో శుక్రవారం వల్లుగుంటకు చెందిన మహిళలు గ్రామదేవతలకు ఆషాడంసారె కావిడలు సమర్పించారు. స్థానిక వల్లుగుంట నుంచి మహిళలు, యువకులు ఊరేగింపుగా మేళ తాలతోను, మంగళవాయిద్యాలతోను ఊరేగింపుగా బయలుదేరారు. కనకదుర్గమ్మ వారు, మహాలక్ష్మి అమ్మవారు. గ్రామదేవత పాటెమ్మ అమ్మవారి కొత్తగుడి, పాతగుడి, గటాల డొంక వద్ద అమ్మవార్లకు వివిధ రకాల పిండి వంటలతో కూడిన సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామప్రజలు సుఖ క్షేమంగాను, సుఖసంతోషాలతోను ఉండాలని గ్రామదేవతలను కోరుకున్నట్లు మహిళలు తెలిపారు.


చాగల్లు మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఆషాఢం సారె సమర్పిస్తున్న మహిళలు

కల్వర్టు నిర్మాణానికి భూమిపూజ


గోపాలపురంలో కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

గోపాలపురం, జూలై11 (ఆంధ్రజ్యోతి): గోపాలపురంలో ముంపునకు గురవుతున్న ప్రాంతాలు ముంపుభారీన పడకుండా కల్వర్టులు, డ్రైన్లు నిర్మాణం ద్వారా ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న వరదనీరు దిగువ ప్రాంతానికి సులభంగా ప్రవహించేందుకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు జిల్లా పరిషత్ నిధులు రూ.80లక్షలు మంజూరు చేసినట్లు టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్ తెలిపారు. అందుకు సంబంధించిన పనులకు శుక్రవారం భూమి పూజ చేశామన్నారు. త్వరితగతిన నాణ్యతా ప్రమాణాలతో కూడిన కల్వర్టులు, డ్రైన్లు నిర్మించి గోపాలపురం పట్టణం ముంపు భారీనపడకుండా ఉండేందుకు యుద్ధ ప్రతిపాదకన పనులు చేపడతామని ఆయన తెలిపారు. సీనియర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రమేశ్, మద్దిపాటి రమేశ్, కుందుల నారాయణరావు, పడమటి శ్రీనివాస్, వాసు, పాల్గొన్నారు.

సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలు



సబ్సిడీపై మంజూరైన డ్రోనును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మున్సిపాల్టీకి సంబంధించిన రైతులకు 80 శాతం సబ్సిడీపై మందులు పిచికారీ చేసుకోవడానికి మంజూరుచేసిన డ్రోనును మండల వ్యవసాయాధికారి ఎ.గంగాధర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంత రం సబ్సిడీ కరపత్రాలను రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తారకరామ కిసాన్ డ్రోన్ గ్రూపునకు రూ.9,80,000ల విలువైన డ్రోనును 80శాతం సబ్సిడీ రూ.7,84,000లు పోగా రూ. 1,96,000లకు డ్రోనును బ్యాంకు ఆఫ్ బరోడా సహకారంతో లోను ద్వారా అందిస్తామన్నారు. డ్రోనును రైతులు వినియోగించుకుని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, మద్దిపట్ల సురేష్, గారపాటి శ్రీవెంకట కృష్ణ రామారావు, వేమగిరి వెంకట్రావు, పెనుమాక జయరాజు, కొప్పాక జవహర్, కలగరసుబ్బారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు 13 ఫిర్యాదులు


కొవ్వూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజలనుంచి 13 ఫిర్యాదులు స్వీకరించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు గ్రీవెన్స్‌లో అందించిన ఫిర్యాదులను ఆయా శాఖల అధికారులకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, నాళం శ్రీనివాస్, మద్దిపట్ల సురేష్, పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలుస్తున్న సీఎం చంద్రబాబు


సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న లబ్ధిదారులతో మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు ప్రజలకు అండగా నిలుస్తున్నారని రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మె ల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శుక్రవారం వేలివెన్ను గ్రామంలో నియోజకర్గంలోని 54 మందికి రూ.40లక్షలు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ ఇది ప్రజలు కోరుకున్న ప్రభుత్వమని, ప్రజల కష్టసుఖాలలో వారికి చేదోడుగా ఉంటుందన్నారు. అనారోగ్యంతో సొంతఖర్చులతో వైద్యం చేయించుకున్న వారికి వారి ఆరోగ్యం మెరుగుపడే విధంగా పూర్తిగా ఆరోగ్యంగా కోలుకోవడానికి ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన వివరించారు. ఈ ఏడాదిలో ఇంతవరకు 350 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సుమారు 3 కోట్ల రూపాయలు ఆర్థిక సహా యం కూటమి ప్రభుత్వం అందజేసినట్లు శేషారావు వివరించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్షులు, గ్రా మ అధ్యక్షులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా భద్రం



నిడదవోలు, జూలై 11(ఆంధ్ర జ్యోతి): నిడదవోలు పట్టణ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న మేడవరపు భద్రం దొరను కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిళ మేడవరపు భద్రందొరను నిడదవోలు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పలువురు కాంగ్రెస్‌పార్టీ నాయకులు కార్యకర్తలు భద్రం దొరను అభినందించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

నల్లజర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పోతవరంలో రైతులకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను పగలగొట్టి అందులో ఉన్న రాగి వైర్లతో గుర్తు తెలియని దుండగులు గురువారం రాత్రి దోచుకున్నారు. అసల ఖరీఫ్ సాగు ప్రారంభం పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ జరగడంతో రైతుల వ్యవసాయ పనులకు ఆటంకం కలిగింది. పోతవరం మాజీ సర్పంచ్ పసుమర్తి సతీష్, గారపాటి సామయేలు, గారపాటి సూర్యచంద్రరావు, దుగ్గిరాల రత్తయ్యకు చెందిన మూడు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. దీనిపై నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.